J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 37 12.2.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# తెలంగాణ ముంగిట్లో రాజన్న బిడ్డ



## ఈ బాణం ఎవరిది

## కమలందా.. కారుదా?..

***దివంగత మహానేత వై.యస్ రాజశేఖరరెడ్డి - విజయమ్మల ముద్దుల కూతురు వై.యస్ షర్మిల పెను రాజకీయ దుమారాన్నే లేపింది. తమ అమ్మానాన్నల పెళ్లి రోజైన ఫిబ్రవరి 9వ తేదీన సంచలన ప్రకటన చేసింది. తాను త్వరలో తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పెట్టనున్నానని, తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తానని ప్రకటించేసింది.***

ఉభయ తెలుగు రాష్ట్రాల రాజకీయ రంగంలో ఇప్పుడు పెనుసంచలనం రేపిన అంశం వై.యస్ షర్మిల తెలంగాణ రాజకీయ ఆరంగేట్రం. ఆమె పార్టీ పెట్టనుంది తెలంగాణలో కదా... ఆంధ్రా రాజకీయాలకు ఏం సంబంధం...? అని రాజకీయ మేధావులు ప్రశ్నించవచ్చు. ఆమె పార్టీ పెట్టేది తెలంగాణలో అయినా ఆమె పుట్టింది ఆంధ్రాలో. రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించిన దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి కూతురు ఆమె. ఆంధ్రాలో ఆమె సొంత అన్న జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఆయనకి తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ రెండు ప్రభుత్వాల మధ్య అవగాహనతో కూడిన పరస్పర ఒప్పందాలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఆమె ప్రకటన రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై తప్పక ప్రభావం చూపిస్తుందనడంలో సందేహం లేదు.

వాస్తవానికి షర్మిల ఇప్పుడు కొత్తగా రాజకీయ ఆరంగేట్రం చెయ్యడం లేదు. కుట్రపూరిత ఆరోపణలతో కాంగ్రెస్‌పార్టీ తన అన్న జగన్ని

10లో

# పతనం అంచుల్లో పచ్చ పార్టీ!



> తప్పులు తడకలతో తనను తాను బలిచేసుకుంటున్న బాబు

> బాబు తప్పిదాలతో 'బాహుబలి'లా బలపడుతున్న జగన్

***కాంగ్రెస్‌తో దోస్తీ చెయ్యడం, అసెంబ్లీలో ఆవేశపడడం, స్థాయి మరచి కింద కూర్చోవడం, కోర్టుల్లో పరపతిని ఉపయోగించడం, నిమ్మగడ్డను భుజాన మోయడం, పంచాయతీ ఎన్నికలకు మేనిఫెస్టో విడుదల చేయడం, అమరావతిని వదిలి హైదరాబాద్‌లో మకాం వేయడం, నేతలలో, పార్టీ క్యాడర్‌లో కార్యకర్తలలో నమ్మకం కోల్పోవడం, అన్నిటినీమించి అసమర్థ కొడుకుని తన రాజకీయ వారసుడిగా చూడాలను కోవడం వంటి అంశాలు ఇప్పుడు బాబు పార్టీకి పెనుశాపాలుగా మారాయి. మామకు వెన్నుపోటు పొడిచి బలవంతంగా లాక్కున్న తెలుగుదేశం పార్టీ క్రమేణా ప్రజలకు దూరమై, నాయకులకు భారమై పూర్తిగా కనుమరుగైపోయే పరిస్థితి కనపడుతోంది.***

***కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా, తెలుగోళ్ళపై ఢిల్లీ పెద్దల పెత్తనానికి స్వస్తి పలకడమే ధ్యేయంగా, 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని ప్రకటించి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో పెను సంచలనాన్ని సృష్టించారు స్వర్గీయ నందమూరి తారక రామారావు. 1995లో మామకు వెన్నుపోటు పొడిచి ఆ పార్టీని అల్లుడు లాక్కున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఏ వెన్నుపోటో, ఎదురు పోటో లేకుండానే తెలుగుదేశం పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితులను చంద్రబాబే కల్పిస్తున్నాడని ఆ పార్టీ వర్గాలే బాహాటంగా చెప్తుండడం విశేషం.***

ముందు తొమ్మిదిన్నరేళ్ళు ఉమ్మడిరాష్ట్రంలోనూ, ఆ తరువాత మళ్ళీ ఐదేళ్లు విభజన ఆంధ్రప్రదేశ్‌లోనూ ముఖ్యమంత్రిగా వెలగబెట్టిన 40 సంవత్సరాల ఇండస్ట్రీ వీరుడు పార్టీని భ్రష్టు పట్టిస్తున్న తీరు చూసి తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. ఏదైనా ప్రభుత్వం కొత్తగా ఏర్పడినప్పుడు, అధికార పార్టీ పనితీరును గమనిస్తూ, వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. అధికారపక్షం ఎక్కడైనా తప్పులు చేస్తుంటే నిర్మాణాత్మకమైన

12లో




## కాలధర్మం

# సామంతు సుబ్బారెడ్డి



సీనియర్ రాజకీయవేత్త, బుచ్చిరెడ్డి పాళెం మండలంలోని పాత మినగల్లు గ్రామ పెద్ద సామంతు సుబ్బారెడ్డి తన 89వ యేట ఫిబ్రవరి 9వతేదీ మంగళ వారం తుదిశ్వాస విడిచారు. గత కొద్ది కాలంగా ఆయన అనారోగ్యంతో వున్నారు. సుబ్బారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు.

కోవూరు నియోజకవర్గ రాజకీయా లలో సుబ్బారెడ్డి కీలక పాత్ర పోషించే వారు. ఒకసారి బుచ్చి సమితి అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మెన్‌గా ఆయన ఉత్తమ సేవలు అందించి రైతుల మనసులు దోచుకున్నారు.

సౌమ్య స్వభావిగా, రైతు పక్షపాతిగా నీతినిజాయితీలు కలిగిన నాయకుడిగా ఆయనకు పేరుంది. జొన్నవాడ కామాక్షమ్మ ఆలయ ఛైర్మెన్‌గా కూడా ఆయన తన హయాంలో ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేశారు. తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల సంక్షేమం కోసం ఆయన పాటుపడేవారు. దేవాలయాలు, విద్యాలయాల అభివృద్ధి కోసం శ్రమించేవారు. తనవద్దకు ఎవరు ఏ సహాయం కోరి వచ్చినా తక్షణమే స్పందించి తనకు చేతనైన మేరకు సేవ చేసేవారు.

ఫిబ్రవరి 10వ తేదీ బుధవారం జరిగిన ఆయన అంతిమయాత్రలో, ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఆయన అభిమానులు, పలువురు రాజకీయవేత్తలు, విశేష సంఖ్యలో రైతులు పాల్గొని ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

సుబ్బారెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మశాంతికై ప్రార్థిస్తుంది 'లాయర్'.

# బండారు విజయకుమార్‌రెడ్డి



ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ కార్యదర్శి, స్నేహశీలి, బండారు విజయకుమార్‌రెడ్డి ఫిబ్రవరి 7వతేదీ ఆదివారం మధ్యాహ్నం హఠాన్మరణం చెందారు. 57 సంవత్సరాల విజయ కుమార్‌ని గుండెపోటు రూపంలో మృత్యువు పొట్టన పెట్టుకుంది.

బండారు రాధాకృష్ణారెడ్డి, సుదర్శ నమ్మల సంతానంగా 1963 సెప్టెంబర్ 1వ తేదీన విజయకుమార్‌రెడ్డి జన్మిం చాడు. సంతపేటలోని సెంట్‌జాన్స్ ఇంగ్లీష్ మీడియంలో ప్రాథమిక విద్యను, సెంట్ జోసఫ్ హైస్కూల్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసి అనంతరం ఇంటర్‌మీడియట్, బి.కామ్‌లను వి.ఆర్ కాలేజీలో చదివి, న్యాయ శాస్త్రాన్ని కూడా వి.ఆర్ విద్యాసంస్థలలోనే అభ్యసించాడు.

విద్యార్థి దశనుండే చురుకైనవాడిగా ఆయనకు పేరుండేది, ఇంటర్ చదివే రోజుల్లో వి.ఆర్ కాలేజీలో అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) నాయకుడిగా విద్యార్థిసంఘం ప్రతినిధిగా పోటీచేసి గెలిచాడు. క్రీడలపట్ల కూడా ఆయన ఎక్కువ ఉత్సాహం కనపరచేవాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొన్న జట్టుకి నాయకత్వం వహించి, తన ప్రతిభతో బంగారు పతకాన్ని కూడా సాధించాడు.

సీమా సెంటర్‌గా ప్రసిద్ధి చెందిన ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో, గణేష్ ఉత్సవాలను అత్యంత ఆర్భాటంగా నిర్వహించడంలో విజయకుమార్‌ది కీలక పాత్ర. నిర్మాణ రంగంలో విలువలు కలిగిన వ్యాపారవేత్తగా కూడా ఆయనకు మంచి పేరుంది. సామాజిక, ఆధ్యాత్మిక, సేవా రంగాలతో పాటు క్రీడా రంగంలో సైతం తన ఉనికిని చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలిని నగరం కోల్పోయింది. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకి విజయకుమార్‌తో అత్యంత సాన్నిహిత్యం ఉంది. డిఆర్‌డిఏ ఛైర్మెన్ గుండ్రా సతీష్‌రెడ్డికి విజయకుమార్ ఆప్తమిత్రుడు. విజయకుమార్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆకస్మికంగా ఇంటి పెద్దదిక్కును కోల్పోయి శోక సముద్రంలో ఉన్న ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, తన ఆప్తమిత్రులని, సహచరులని విడిచి సుదూర తీరాలకు తరలిపోయిన విజయకుమార్‌రెడ్డి ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

### ఉపరాష్ట్రపతి సంతాపం...

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బండారు విజయ మరణానికి తీవ్రవిచారం ప్రకటించి, ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. 'చిన్నతనం నుంచి అందరితో కలివిడిగా తిరిగే విజయకుమార్‌రెడ్డి అంటే తనకెంతో అభిమానమని, నెల్లూరుకు తానెప్పుడు వచ్చినా ఎంతో ఆత్మీయతతో తనను కలిసేవాడని, అప్పజెప్పిన కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించేవాడని, అలాంటి వ్యక్తి తక్కువ వయస్సులోనే హఠాత్తుగా పరమ పదించడం బాధాకరమని' ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. విజయకుమార్‌రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ... ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

కరోనా సమయంలో విధులు నిర్వ హించిన తమకు ఉద్యోగభద్రత కల్పిం చాలని కోవిడ్ వారియర్స్ కోరారు. ఈనెల 8న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసు పత్రి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నాందోళన చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన 1200 మందిని తొలగించడం అన్యాయమని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళనలో జి.మల్లికార్జున రావు, కవిత, హరిబాబు, మహేష్, నాగ రాజు, ధీరేష్, ప్రదేష్ పాల్గొన్నారు.

## కోవూరు ఎస్ఐకి సన్మానం

విధి నిర్వహణలో రాష్ట్రస్థాయిలో ఉత్తమరీతిలో ప్రతిభ కనపరుస్తూ ప్రతి ష్టాత్మకమైన ఏబిసిడి పురస్కారాన్ని డిజిపి నుంచి అందుకున్న కోవూరు ఎస్ఐ కృష్ణా రెడ్డిని ఈనెల 7న కోవూరులోని ప్రముఖ పారిశ్రామికవేత్త వాసిరెడ్డి సతీష్‌రెడ్డి మిత్ర బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో రాఘవ పాఠశాల కరెస్పాం డెంట్ మారుతి, ఐ.మల్లారెడ్డి, పి.సుబ్బా రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, జి.పెంచలరెడ్డి పాల్గొని ఎస్ఐ సేవలను అభినందించారు.

## పుస్తకపఠనంతో విజ్ఞానం

విద్యార్థులు పుస్తకపఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని, పుస్తకాలు చద వడం ఒక దినచర్యగా అలవరచుకోవాలని ఇందుకూరుపేట ఎంఇఓ శ్రీహరి చెప్పారు. ఈనెల 7న ఇందుకూరుపేటలోని గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు పుస్తకపఠనం పట్ల అవగాహన కలిగిం చారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులందజేశారు. విశ్రాంత ఉపా ధ్యాయుడు తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, లైబ్రేరియన్ సుజాత పాల్గొన్నారు.

## సాయినాథునికి విశేష పూజలు

కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాళెంలో ఉన్న శ్రీ సాయిబాబా మం దిరం 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 7న సాయినాథునికి మందిరంలోని అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. డిపిఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతి రావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయిబాబా మందిరం నిర్వాహకులు బి.సుధాకర్‌రెడ్డి, డి.మల్లి కార్జునరెడ్డి కె.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## విశ్వేశ్వరస్వామికి పల్లకి సేవ

మైపాడులోని అన్నపూర్ణాంబ సమేత శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామికి ఈనెల 8న పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. గూడూరు శివయ్య, అలివేలు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ ఛైర్మెన్ సురేంద్ర బాబు, మాజీ ఎంపీటిసి వెంకయ్య, నరసా పురం మాజీసర్పంచ్ సురేంద్ర పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేటకు వచ్చిన.. రైల్వే డిఆర్ఎం

- అండర్‌బ్రిడ్జి పనుల పరిశీలన
- మూడు నెలల్లో పూర్తిచేయాలని సూచన



సూళ్ళూరుపేట వద్ద జరుగుతున్న అండర్‌బ్రిడ్జి పనులను దక్షిణమధ్య రైల్వే చెన్నై డివిజన్ డిఆర్ఎం పి.మగేష్ పరిశీలించారు. ఈనెల 9న ఆయన ప్రత్యేకరైలులో చెన్నై నుంచి సూళ్ళూరుపేటకు వచ్చి రైల్వేస్టేషన్‌ను, రైల్వే కార్యాలయాలను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌కు సమీపంలోనే జరుగుతున్న ఎల్‌సి-60 అండర్‌బ్రిడ్జి పనులను పరిశీలించి ఇంజనీర్ల ద్వారా ఆ వివరాలు తెలుసుకున్నారు. అండర్‌బ్రిడ్జి పనులను మూడునెలల్లో పూర్తిచేయాలని ఆయన అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే అధికారులు, బిజెపి నాయకులు ఆయన్ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

# విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు



విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని నినాదాలు చేస్తూ, విశాఖపట్నంలోని ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆంధ్రుడిపై ఉందంటూ సిపిఎం, కాంగ్రెస్ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 8న బుచ్చిరెడ్డిపాళెంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట వారు విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిరసిస్తూ ఆందోళన చేశారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి వారు ఈ సందర్భంగా మద్దతు తెలిపారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు జానీబాషా, పి.శ్రీనివాసులు, పఠాన్‌బాబు, ఎస్‌కె కరిముల్లా, దుర్గాప్రసాద్, వి.రాజ, సిఐటియు నాయకులు మునీర్ అహ్మద్, సిహెచ్ మల్లికార్జున, కాంగ్రెస్ నాయకులు బి.కిషోర్, పచ్చా మధు, కోవూరు మహేష్, షేక్ సర్దార్, షాకీర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సిహెచ్ఎస్ లక్ష్మి కోరారు. ఈనెల 8న ఆమె విడవలూరు మండలంలోని యల్లాయపాళెంలో రైతు భరోసా కేంద్రంలో సమావేశమైన రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చే ఏ-గ్రేడ్ ధాన్యం పుట్టి రూ.16,048, బి-గ్రేడ్ ధాన్యానికి పుట్టి రూ. 15,878 వంతున ధర చెల్లించడం జరుగుతుందని చెప్పారు.

## అభ్యర్థుల ఖర్చుల వివరాలు తప్పనిసరి

పంచాయతి ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను సంబంధిత అధికారులు తప్పనిసరిగా నమోదు చేయాలని పంచాయతి ఎన్నికల ఆడిట్ అధికారి ఎస్‌కె మహమ్మద్ రఫీ స్పష్టం చేశారు ఈనెల 8న ఆయన ఆత్మకూరులోని వెలుగు కార్యాలయంలో అధికారుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను ఎన్నికల అనంతరం 45 రోజుల లోగా అధికారులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ కృష్ణారెడ్డి, నోడల్ అధికారి కిరణ్, ఆత్మకూరు ఏఓ సిహెచ్ శ్రీనివాసులు, సీనియర్ ఆడిటర్ సురేంద్ర, శివకుమార్ పాల్గొన్నారు.

## షూటింగ్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు.. జిల్లా విద్యార్థుల ఎంపిక

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, కోవూరుకు చెందిన విద్యార్థులు ఢిల్లీలో జరిగే ఈ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో కోవూరు మండలంలోని గుమ్మళ్ళదిబ్బకు చెందిన సత్యసుమ ఎంపిక కాగా, బాలుర విభాగంలో గద్దె కార్తీక్ ఎంపికయ్యాడని, వీరు ఈనెల 11 నుంచి 14వతేదీ దాకా ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భీమవతాటి వెంకటరమణయ్య పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు భారీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 214 కొనుగోలు కేంద్రాలు
- దళారుల ఆటకట్టించే దిశగా సన్నాహాలు



*రైతులు ఎంతో శ్రమపడి సాగుచేసుకున్న పంటలను తక్కువ ధరకే కొనేసి రైతులను దివాలా తీయిస్తున్న దళారీల ఆట కట్టించేందుకు జిల్లా ఉన్నతాధికారులు ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోళ్ళలో రైతులకు అన్యాయం జరిగిందనే ఆరోపణలను ఈసారి రానివ్వకుండా, రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని ముమ్మరంగా కృషి చేస్తున్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల పట్ల అవగాహన కలిగించుకుని, దళారుల బారిన పడకుండా ధాన్యం విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.హరేందిరప్రసాద్ సూచిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రైతులకు అధికారులు ఆమేరకు అవగాహన కలిగిస్తున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.*

జిల్లాలో ఇటీవల పుష్కలంగా వర్షాలు కురవడం, సాగునీటికి ఇబ్బందులు లేకపోవడంతో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులు ఎంతో ఉత్సాహంగా వరిపంటను సాగుచేశారు. జిల్లావ్యాప్తంగా కనీసం 5.30 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి ఉంటుందని అంచనా. ఈసారైనా ఆశించిన స్థాయిలో మద్దతు ధర లభిస్తుందనే నమ్మకంతో ప్రభుత్వం వైపు ఎంతో ఆశతో చూస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఈసారి మరింత పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

## గతంలో కంటే పకడ్బందీగా ఏర్పాట్లు

ఈ సీజన్‌లో జిల్లాలో రైతులకు అందుబాటులో ఉండేవిధంగా 214 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడో పంట పొలాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలంటే రైతులకు కష్టంగా ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకుని దళారులే పంటపొలాల్లోకి వెళ్ళి ధాన్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేసేవారు. ఇకనుంచి రైతులకు ఆ అవస్థలు లేకుండా రైతు భరోసా కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందిని కూడా నియమిస్తుండడంతో రైతులకు పెద్దగా వ్యయప్రయాసలు లేకుండానే కొనుగోళ్ళు చేసేందుకు వీలుంటుందని భావిస్తున్నారు.

## పంట రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పంట రిజిస్ట్రేషన్ అన్నది రైతులకు తప్పనిసరి అని గమనించాలి. రైతులు పంట రిజిస్ట్రేషన్‌కు వెళ్ళేటప్పుడు తమతో పాటు బ్యాంకు పాస్‌పుస్తకం, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు నకలును తీసుకు వెళ్ళి అక్కడి ఉద్యోగులకు చూపించాలి. దానివల్ల రైతులకు డబ్బులు నేరుగా రైతు ఖాతాలోనే జమ అయ్యేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియనే 'ఈ-క్రాప్' బుకింగ్ అంటారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల ధాన్యాన్ని మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. కౌలు రైతులు కూడా తప్పనిసరిగా ఈ-క్రాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అంతేకాదు, పోరంబోకు భూముల్లోను, శివాయి భూముల్లోనూ పంటలు వేసుకున్నవారు కూడా రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి ఈ-క్రాప్ నమోదు చేసుకొంటే వారి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పంట రిజిస్ట్రేషన్ సమయంలో ధాన్యం కొనుగోలు తేదీని సూచిస్తూ సిబ్బంది సంతకం చేసిన కూపన్ కూడా రైతులకు ఇస్తారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు రావాల్సిన అవసరం లేకుండానే రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదిస్తే చాలు..వారే వచ్చి ధాన్యం కొనుగోళ్ళలో రైతన్నలకు అండగా నిలిచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## మద్దతు ధరతో రైతులకు ఊరట

ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరను కూడా కొద్దిగా పెంచింది. దీంతో జిల్లా రైతులకు కొంతమేరకు ఊరట కలుగుతోంది. గత ఏడాది ఏ-గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు 1835 రూపాయలు ఇవ్వగా, ఈఏడాది ఆ మొత్తాన్ని 1888 రూపాయలకు పెంచారు. అందువల్ల పుట్టికి 16,048 రూపాయలు లభిస్తాయి. గ్రేడ్-ఏ రకాలైన బిపిటి-4204, ఎన్ఎల్ఆర్-34449, ఎన్ఎల్ఆర్-3354, ఆర్ఎన్ఆర్-15048, జేజేఎల్-1156 రకాల ధాన్యానికి క్వింటాల్‌కు 1888 రూపాయల మద్దతు ధర లభిస్తుంది. సాధారణ రకాలైన ఎంటియు-1001, సిఆర్-1009, ఏడిటి-37, ఏడిటి-43, ఎన్ఎల్ఆర్-3367 రకాల ధాన్యానికి క్వింటాల్‌కు మద్దతు ధరగా 1868 రూపాయలు నిర్ణయించారు. ఇందువల్ల పుట్టికి 15,878 రూపాయలు రైతుకు లభిస్తాయి.

ఇప్పటికే నాయుడుపేట డివిజన్‌లో వరికోతలు జరుగుతున్నాయి. అక్కడ ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళు జరుగుతున్నాయ. కనుక రైతులు గతంలో మాదిరిగా దళారీలు, మధ్యవర్తులు, వ్యాపారుల మాయోపాయాలకు, రకరకాలుగా మభ్యపెట్టే వారి మాటలకు మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకుని రైతులు ప్రయోజనం పొందేలా అధికారులు చేస్తున్న ఈ ఏర్పాట్లను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

## రైస్ మిల్లర్ల సమస్యలు తీర్చేందుకు
# ఉపరాష్ట్రపతి చొరవ

- కేంద్ర ఉన్నతాధికారులతో వెంకయ్యనాయుడు సమావేశం



దేశంలోని రైస్ మిల్లర్లు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కేంద్ర ఆహార మరియు ప్రజాపంపిణీ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఇటీవల ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆహార మరియు ప్రజాపంపిణీ శాఖ కార్యదర్శి సుధాన్షు పాండే మరియు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్‌లను ఈనెల 11వ తేదీ గురువారం నాడు ఢిల్లీలోని తమ నివాసానికి పిలిపించిన ఉపరాష్ట్రపతి, రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో రైస్ మిల్లర్ల ప్రధాన సమస్యలైన బియ్యం కొనుగోలు సుముఖత విధానం, తక్కువ పోషకాలున్న బియ్యం కొనుగోలు, తూనికల విధానం, పాలిష్ తగ్గించే అంశాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులను ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి ఉపరాష్ట్రపతికి తెలియజేశారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉత్పత్తి అయిన అదనపు వరి ధాన్యం సేకరణ విషయంలో, ఎఫ్.సి.ఐ. నిర్దేశించిన పరిమితి కంటే అధిక నిల్వలను పారదర్శకంగా, విశ్వసనీయమైన విధానంలో కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసి, త్వరలో ఉత్తర్వులు ఇస్తామని, ఈ విషయంలో సమగ్ర సంస్కరణలు చేపడతామని, ఇందుకోసం రాష్ట్రాలతో సంప్రదిస్తున్నట్లు కార్యదర్శి, ఉపరాష్ట్రపతికి తెలియజేశారు. అనంతరం రైస్ మిల్లర్లతో చర్చించి, వారి సమస్యలను సానుకూల మార్గంలో పరిష్కరించాలని ఉపరాష్ట్రపతి కార్యదర్శికి సూచించారు. ఉపరాష్ట్రపతి సూచన మేరకు అదనపు ఉత్పత్తినంతా కొనుగోలు చేసేందుకు ఎఫ్.సి.ఐ. కార్యదర్శి మరియు ఛైర్మన్ అంగీకారం తెలిపారు.

# ఇక.. రెండో విడత టీకా

కరోనా నివారణకు వేస్తున్న టీకాను రెండో డోసు వేసేందుకు జిల్లా వైద్యాధికారులు సిద్ధమవుతున్నారు. గతనెల 16న తొలివిడత టీకా వేయించుకున్నవారికి ఈనెల 13వతేదితో 28రోజులు పూర్తవుతాయి కనుక రెండవ డోసు టీకా వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతనెలలో టీకా ప్రారంభమైన రోజున 1346 మందికి టీకా వేశారు. ఆ తర్వాత వారం రోజుల్లో మరో 12,885 మందికి టీకా వేయడం జరి గింది.వారందరికీ ఇక రెండవ డోసు టీకా వేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలి విడత టీకా పంపిణీకి పుణే ల్యాబ్ నుంచి 38,500 డోసుల కొవిషీల్డ్ వ్యాక్సిన్ వచ్చింది. అదే సంస్థ నుంచి జిల్లాకు మరో 30వేల డోసుల వ్యాక్సిన్ కూడా చేరిందని, ప్రతిఒక్కరూ టీకా వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.





ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం, మా పెద్దదిక్కు

శ్రీ బొమ్ము దినకర్ గారు

తే. 08.02.2021ది,
సోమవారం సాయంత్రం పరమపదించారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు:
బొమ్ము ప్రవీణ్
బొమ్ము ప్రతాప్
బొమ్ము ప్రశాంత్ (శాంతి)

ఉత్తరక్రియలు : వారి పెద్దకర్మ తే.18.02.2021ది, గురువారం ఉదయం, గూడూరు సొసైటీలోని వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## 'ప్రభా'తం

# మరో గుణపాఠం

ప్రకృతిని, పర్యావరణాన్ని పట్టించుకోకుంటే ఎంతటి ఘోరం జరుగుతుందో ఉత్తరాఖండ్ విలయం మరో ప్రత్యక్ష నిదర్శనమైంది. హిమాలయాలు కరిగిపోతున్నా, భూతాపం పెరిగిపోతున్నా పట్టించుకోకపోగా హిమాలయాల్లో మంచు చరియలు విరిగిపడే ప్రమాదకర ప్రాంతాల్లో పెద్దపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలకు పూనుకోవడం వల్లే ఈ దుర్గతి ప్రాప్తించింది. ఇది అక్షరాల మానవ తప్పిదానికి నిదర్శనం. తప్పకుండా ఇది మరో గుణపాఠమే అవుతుందని చెప్పక తప్పదు!..



ప్రకృతిని, పర్యావరణాన్ని పట్టించుకోకుంటే ఎంతటి ఘోరం జరుగుతుందో ఉత్తరాఖండ్ విలయం మరో ప్రత్యక్ష నిదర్శనమైంది. మానవ తప్పిదానికి, నిర్లక్ష్యానికి ఎంతోమంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. తప్పకుండా ఇది మరో గుణపాఠమే. భూ తాపం కారణంగా పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందని శాస్త్రజ్ఞులు ఎంతోకాలం నుంచి నెత్తీనోరు బాదుకుంటున్నా వినే నాధులు లేకపోవడంతో పరిస్థితి రానురాను దయనీయంగా మారుతోంది. చేజేతులా విలయాన్ని కొనితెచ్చుకొని మనకు మనమే అల్లాడవలసిన దుర్గతి పడుతోంది. ఎప్పుడూ కొండచరియలు విరిగిపడుతున్న హిమాలయాల ప్రాంతాల్లో జల విద్యుత్ కేంద్రాలను ఇబ్బడిముబ్బడిగా నిర్మించి లేనిపోని కష్టనష్టాలకు గురికావద్దని నిపుణులు హెచ్చరిస్తున్నా పట్టించుకోనందుకు ఇది గుణపాఠమైంది. దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్ ఇటీవల ఒక్కసారిగా వరద విలయం ధాటికి వణికిపోవడం, ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలోని జోషిమట్ ప్రాంతంలో నందాదేవి హిమానీనదంలో పెద్దపెద్ద మంచు చరియలు విరిగిపడి అకస్మాత్తుగా భారీ వరదలుగా పరిణమించి ఎవరూ ఊహించనివిధంగా అలకనంద, ధౌలీగంగ, రుషిగంగ నదులు పొంగిపొర్లి జలప్రళయంగా మారడం అందరినీ నిర్ఘాంతపరచింది. వరద ధాటికి పర్వత ప్రాంతాల్లో ఉన్న 13.32 మెగావాట్ల రిషిగంగ జలవిద్యుత్ కేంద్రం పూర్తిగా కొట్టుకుపోయింది. ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో ఉన్న తపోవన్-విష్ణుగడ్ 480 మెగావాట్ల విద్యుత్ కేంద్రం కూడా భారీగా దెబ్బతిన్నది. రిషిగంగ నది వరద దెబ్బతో అక్కడున్న రేణి అనే గ్రామం దగ్గరున్న 12.3 మెగావాట్ల చిన్నపాటి జలవిద్యుత్ కేంద్రం అసలు నామరూపాల్లేకుండా పోయింది. ఈ ఆకస్మిక వరదల ప్రవాహానికి అయిదు వంతెనలు అంతు లేకుండాపోయాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో చుట్టుపక్కలున్న అనేక గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. ఈ దుర్ఘటనలో 170 మంది దాకా కార్మికులు గల్లంతై వారి ఆచూకీ కనిపించకపోవడం అత్యంత విషాదకరం. ఇప్పటిదాకా 32 మంది దాకా చనిపోయినట్లు గుర్తించారు. గల్లంతైన వారిలో ఇంకా అనేకమంది కూడా మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. సైన్యం, పోలీసు బలగాలు, జాతీయ విపత్తు నివారణ దళం వారు వెంటనే రంగంలోకి దిగి ఎంతోమందిని రక్షించడమే కాక, పలువురి మృతదేహాలను కూడా వెలికితీయడం వారి కర్తవ్య దీక్షాదక్షతకు, సమాజ సేవాపరాయణతకు నిదర్శనం. అయినా..వానమబ్బులు లేకుండానే..చడీచప్పుడు కాకుండానే ఉన్నట్లుండి మహోధృతంగా జలప్రళయంలా వచ్చి పడింది వరద. జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి కార్మికులంతా సొరంగం పనులు చేస్తుండగా హటాత్తుగా వచ్చిన ఈ వరదప్రవాహం వారందరినీ కకావికలం చేసింది. ఆ సొరంగాల్లో దాదాపు 40 అడుగుల దాకా బురదమట్టి వచ్చిపడడంతో పరిస్థితి ఎంత ఘోరంగా మారివుంటుందో ఊహించుకోవచ్చు. దీంతో గల్లంతైన వారిని వెతికేందుకు కూడా వీలుకాని దుస్థితి. ఇలాంటి విపత్తుల్ని ముందుగానే ఊహించి, హిమాలయ పర్వత ప్రాంతాల పైభాగాల్లో ఇలాంటి ప్రాజెక్టులు కట్టకూడదని నిపుణులు తెలిపినా నిర్లక్ష్యం వహించడం దారుణం. కొండలను చిత్తం వచ్చిన రీతిగా తవ్వేసి, పచ్చని చెట్లన్నిటినీ కొట్టేసి ప్రాజెక్టులు నిర్మించడం వల్ల పర్యావరణ సమస్యలు ఏర్పడి చివరికి ప్రమాదంగా మారి పెనుముప్పుగా పరిణమిస్తాయని నిపుణులు, పర్యావరణవేత్తలు ఎప్పటికప్పుడు ఘంటాపథంగా చెప్తూనే ఉన్నప్పటికీ ఆ మాటలన్నీ ప్రభుత్వాల చెవులకు ఎక్కడం లేదు. విద్యుత్ కొరతను నివారించడానికి ఇంతకంటే మార్గాంతరం లేదంటూ వాటి నిర్మాణాలకు భారీఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తుండడం ఏమిటో అర్థం కాదు. ప్రాజెక్టుల పేరుతో అత్యంత సున్నితమైన హిమాలయ పర్వత ప్రాంతాల్లో పెద్దఎత్తున తవ్వకాలు జరుపుతుండడమే ఇప్పుడొక పెద్ద విపత్తుగా పరిణమిస్తున్నదనడానికి ఇప్పుడొచ్చిన వరద విలయం కంటే ఇంకా మరెంత పెద్ద సాక్ష్యం కావాలి?.. అడ్డదిడ్డంగా కొండల్ని తవ్వేయడం వల్ల గతంలో ఉత్తరకాశీలోనూ, చమోలీ జిల్లాలోనూ భూకంపాలు సంభవించినా, అలకనందా నదికి, భగీరథి నదికి భారీ వరదలు సంభవించినా, 2013లో కేదారనాధ్ వద్ద ఇలాగే ఆకస్మిక వరదలు పెద్ద ఉపద్రవంగా వచ్చిపడిన భీభత్సంలో వేలాది మంది భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయినా ఇప్పటికీ ప్రభుత్వాల్లో, పాలకుల్లో చలనం లేకపోవడం శోచనీయం. తమ రాజకీయ లబ్దికోసం పర్యావరణ విధ్వంసక దారిలో వెళ్తున్నారే తప్ప ప్రకృతిని, పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదంతా మానవతప్పిదమే. అందుకు కనువిప్పుగా.. కొండల్ని తవ్వేసి, అడవుల్ని నరికేసి చేస్తున్న విధ్వంసానికి ప్రతీకారంగా ప్రకృతి ఇలా విలయంగా విరుచుకుపడుతోందనే అనుకోవాలి. ఇలాంటి ఉపద్రవాల్లో ఎంతోమంది ప్రాణాలు పోతున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటూ..అభివృద్ధి పేరుతో చేస్తున్న ప్రకృతి విధ్వంసమే తిరిగి మనకు శాపమై తగులుకుంటోంది. మనకు అనుక్షణం ప్రాణం పోస్తున్న ప్రకృతిని మనం కంటికి రెప్పలా కాపాడుకుంటేనే ప్రకృతి మనల్ని కరుణిస్తుందనే విషయాన్ని గమనించాలి. ఇప్పటికైనా కేంద్రం, దాంతోపాటు అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు, మేధావులు, నిపుణులు అందరూ సంయుక్తంగా ఆలోచించి ప్రకృతికి, పర్యావరణానికి ఎక్కడా ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రాజెక్టులను నిర్మించుకునేలా సరికొత్త ప్రణాళికలకు రూపకల్పన చేసుకుని ముందడుగు వేయాలి. పర్యావరణానికి నష్టం కలిగించే అన్నిరకాల చర్యలను వెంటనే నివారించుకుని, ప్రకృతితో మమేకమై చక్కని వాతావరణంలో అందరూ హాయిగా మనగలిగేలా చూడాలి. అప్పుడే అది 'అసలైన అభివృద్ధి'.. అవుతుందని గుర్తించాలి.

## రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా హాకీ జట్లు



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈనెల 7న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో హాకీ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల జట్లను ఎంపికచేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు ఈ ఎంపికలకు వచ్చారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన బాలబాలికలను ఎంపిక చేసి 18 మందితో జట్లను ఏర్పాటు చేశారు. వీరిలో సబ్‌జూనియర్ బాలికల జట్టు ఈనెల 12 నుంచి 14వ తేది వరకు గూడూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని, 20 నుంచి 22వ తేది వరకు విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో బాలుర జట్టు పాల్గొంటుందని హాకీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా ఈనెల 17 నుంచి 20వతేది వరకు అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రాస్థాయి పోటీల్లో జిల్లా జూనియర్ బాల బాలికల హాకీ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ్, కార్యదర్శి ప్రణయ్‌సంతోష్, డైరెక్టర్ థామస్‌పీటర్‌లతో పాటు అడ్వయిజర్ బి.సురేష్‌బాబు, కోశాధికారి అబ్రహం, కుమార్, కార్యవర్గ సభ్యులు లావణ్య, లక్ష్మయ్య, భాస్కర్‌రావు, అనిల్, జగన్మోహన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల పోరాటానికి మద్దతుగా..

## జాతీయ రహదారి నిర్బంధం

ఢిల్లీలో జరుగుతున్న రైతుల పోరాటానికి మద్దతుగా నెల్లూరులో ఈనెల 6న జాతీయ రహదారిని దిగ్బంధించి కేంద్రప్రభుత్వం ప్రకటించిన కొత్త సాగు చట్టాలకు నిరసనలు తెలిపారు. సిపిఎం, సిఐటియు, వివిధ రైతు సంఘాలు, కార్మికసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు ఈ ఆందోళనలో పాల్గొని నెల్లూరులోని అయ్యప్పగుడి, బుజబుజనెల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై బైఠాయించడంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు వచ్చి ఉద్యమకారులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. సిఐటియు నాయకులు అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు, మూలం రమేష్, రైతుసంఘాల నాయకులు పి.శ్రీరాములు, కోటిరెడ్డి, వెంకమరాజు తదితర నాయకులు పాల్గొని కొత్తసాగు చట్టాలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.



### ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్‌కు

## కొత్త పాలకవర్గం

**అధ్యక్షునిగా అమరా మోహన్‌రావు**

నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్‌కు కొత్త పాలకవర్గం ఎన్నికైంది. అధ్యక్షునిగా అమరా మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎంపి ఆంజనేయులు, కోశాధికారిగా కె.శోభన్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మెంటా చంద్రశేఖర్, అమరా శివ, కొనగళ్ళ మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా చక్కా లక్ష్మీనారాయణ, మామిడి శ్రీనివాసులు నియమితులయ్యారు. నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న ఆ సంఘం కల్యాణమండపంలో ఈ ఎన్నిక జరిగింది.

### వచ్చే నెల 15 నుంచి..

## పొగాకు కొనుగోళ్ళు

జిల్లాలో మార్చి 15 నుంచి పొగాకు కొనుగోళ్ళను ప్రారంభించనున్నారని డిసిపల్లి పొగాకు బోర్డు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాలి నరసప్పనాయుడు పేర్కొన్నారు. 2020-21 పంట కాలానికి పొగాకును పండించిన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని వివరించారు. పొగాకు పంటకు గ్రేడింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

## చిన్నమ్మను చూస్తే ఎందుకంత భయం..?




lawyerpatrika@gmail.com
+91 98663 14741

అక్రమ సంపాదన కేసులో శిక్ష పూర్తి చేసుకుని బెంగుళూరు జైలు నుండి విడుదలై చెన్నైకి వచ్చిన జయలలిత నెచ్చెలి చిన్నమ్మ శశికళకు, ఆమె రాక సందర్భంలో తమిళనాడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ఫళనిస్వామి, పన్నీరు సెల్వంలు అడుగడుగునా ఆటంకం కలిగించారు. ఆమె కారుకు పార్టీ జెండా ఉండకూడదని శాసించారు. ఆమెను జయలలిత సమాధి వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు, ఆమెకు స్వాగతం చెప్పిన ప్రధాన నాయకులకు, ఆమెకు వాహనం సమకూర్చిన మరో నాయకుడికి హెచ్చరికలు జారీ చేశారు. జయలలిత మరణానంతరం సైతం శశికళకు అంతటి ప్రజాదరణ ఉంటుందా..? పాత తరహాలోనే ఆమె ఇప్పుడుకూడా రాష్ట్ర రాజకీయాలలో చక్రం తిప్పగలదా..?? మన్నారుగూడి మాఫియా అండతో పాటు లెక్కలేనంత సంపాదనే ఆమెకు ఇప్పుడున్న అర్హతలు. జయలలిత స్థాయిలో ఆమె నాయకులను శాసించలేదు, అంతటి చరిష్మా కూడా చిన్నమ్మకు లేదు. మరి ఆమెను చూసి ఎందుకంత భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నది చాలామందికి ఉన్న అనుమానం. అయితే రజనీకాంత్ అంతటివాడు ఆమెకు నేరుగా ఫోన్‌చేసి క్షేమ సమాచారం కనుక్కోవడంతో, ఇప్పుడు తమిళనాడు రాజకీయ రంగంలో శశికళ కీలక వ్యక్తిగానే మారబోతోందని తమిళ తంబిల అంచనా కాబోలు.

– యం.చంద్రమౌళి, **కొత్తఢిల్లీ.**

## పనులను ప్రారంభించి నిలిపివేయడంలో.. కావలి ప్రసిద్ధి

కావలి కళుగోళమ్మ గుడి దగ్గర బ్రిడ్జిని నిర్మించారు. కానీ ఆ పని పూర్తి కాలేదు. వైకుంఠపురం నుండి ట్రంకురోడ్డుకు వచ్చే ప్రజలు వాహనాల మీద రాకుండా పోయింది. కనీసం కాలినడకనైనా రైల్వే గేటులో నుండి ట్రంకురోడ్డుకు రావాలన్నా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కేవలం బ్రిడ్జిని నిర్మించి, ప్రజలను ట్రంకురోడ్డుకు రాకుండా సరియైన రహదారిని నిర్మించలేకపోయినారు. అదేవిధంగా కావలి విశ్వోదయ పాఠశాల నుండి ట్రంకురోడ్డును కలుపుతూ బ్రిడ్జిని నిర్మిస్తే, కావలి జనతాపేట, వెంగళరావునగర్ ప్రజలకు ఉపయోగం లేకుండాపోయింది. ఈ బ్రిడ్జి నిర్మించకముందు, జనతాపేట, వెంగళరావు నగర్ ప్రజలు రైల్వేగేట్ మీదుగా కాలినడకన గాని, వాహనాల మీదుగా గాని ట్రంకురోడ్డుకు త్వరగా చేరుకునేవారు. ఈ ప్రాంతంలో రైల్వేగేటును మూయడంతో ఈ ప్రాంత ప్రజలు కూడా ట్రంకురోడ్డు వెళ్ళడానికి ఇబ్బందిపడుతున్నారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి ఉండి కూడా ప్రజలకు ఉపయోగం లేకుండాపోయింది.

– ఏవిఎన్ ప్రవీణ్‌చంద్రకుమార్, **కావలి.**

# రాజ్యసభలో విపిఆర్ ప్రశ్నల పరంపర

## ➤ ఢిల్లీలో మార్మోగుతున్న నెల్లూరు వాణి



**రాజ్యసభలో నెల్లూరువాణిని ఘనంగా వినిపిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. దేశానికి, మన రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన ఇటీవల పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. దేశంలోని అనేక అభివృద్ధి పథకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ పథకాల పనితీరుపై వివరణలు కోరుతున్నారు. సంబంధిత కేంద్రమంత్రులు కూడా అందుకు స్పందిస్తూ లిఖితపూర్వకంగా సమాధానాలిస్తున్నారు.**

### కంభం - ప్రొద్దుటూరు

### కొత్త రైల్వేలైన్ పరిస్థితి ఏమిటి?

ఆంధ్రప్రదేశ్‌లోని కంభం - ప్రొద్దుటూరు కొత్త రైల్వేలైన్ చేపట్టడం వాస్తవమా? రైల్వే శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం ఎప్పుడు కుదిరింది, కొత్త లైన్ నిర్మాణం పరిస్థితి ఏమిటి?. అది ఎప్పటికి పూర్తవు తుందని ఈనెల 5న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభలో ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం, రైల్వేశాఖల ద్వారా చేసిన నిర్మాణ వ్యయం వివరాలు కూడా తెలియ జేయాల్సిందిగా ఆయన కోరారు. అందుకు స్పందించిన రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ కంభం-ప్రొద్దుటూరు 142.28 కిలోమీటర్ల కొత్త లైన్ ప్రాజెక్టును 2013-14లో బడ్జెట్‌లో చేర్చామని, ఇది అవసరమైన ఆమోదాలకు లోబడి ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని భూమిని ఉచితంగా అందించాలని, మరియు 50 శాతం నిర్మాణ వ్యయాన్ని భరించాలని కోరామని పేర్కొన్నారు. ఆ తర్వాత నుంచి ప్రాజెక్టు ముందుకు సాగలేదని, రైల్వేమంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఎలాంటి అవగాహన ఒప్పందం కుదుర్చు కోలేదని, ప్రాజెక్టు ఇంతవరకు మంజూరు కాలేదని లిఖిత పూర్వకంగా వివరించారు.

### 'శక్తి' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కి బొగ్గు కేటాయింపులున్నాయా?..

శక్తి పథకం కింద బొగ్గు కేటాయింపు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి బొగ్గుగనుల మంత్రిత్వ శాఖకు ఏదైనా అభ్యర్థన అందిందా?.. దాని వివరాలేమిటి?.. ఏపికి ఈ పథకం కింద బొగ్గు కేటాయింపులున్నాయా?.. అందుకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని ఎంపి వేమిరెడ్డి ఈనెల 8న రాజ్య సభలో ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు అనుసంధానాలు శక్తి-2017 పాలసీలోని పారా బి(ఐ) నిబంధనల ప్రకారం కేటాయించబడ్డాయన్నారు. పారా బి(ఐ) సిఐఎల్, ఎస్‌సిసిఎల్ కింద కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వాల జెన్‌కోలకు బొగ్గు అనుసంధానాలను మరియు సిఐఎల్, ఎస్‌సిసిఎల్ నోటిఫైడ్ ధర మంజూరు చేయవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా బొగ్గు అనుసంధానాల సిపిఎస్‌యుల మధ్య సిపిఎస్‌యులలోనూ, మరియు రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ఏర్పాటుచేయబడిన జాయింట్ వెంచర్లకు మంజూరు చేయబడతాయని, విద్యుత్ మంత్రిత్వ శాఖ దీనికి సంబంధించిన సిఫార్సులను చేస్తుందని తెలియజేశారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ సిఫార్సుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టిటిపిఎస్ స్టేజ్-5 (800 మెగావాట్లు), దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం స్టేజ్-2 (800 మెగావాట్లు), రాయలసీమ యు-6 (అదనపు 100 మెగా వాట్ల కోసం), ఏపి జెన్‌కో థర్మల్ పవర్‌ప్లాంట్లకు శక్తి పాలసీ యొక్క పారా బి(ఐ) కింద బొగ్గు అనుసంధానాలు కేటాయించడం జరిగిందని విపిఆర్‌కు వివరించారు.

### విద్యుత్ సంస్కరణలపై వివరణ ఇవ్వండి...

విద్యుత్‌రంగంలో ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలు, డిస్కమ్‌లో సంస్కరణల కోసం ఇటీవల ప్రభుత్వం ముసాయిదా విద్యుత్ బిల్లును విడుదల చేసింది వాస్తవమా, అయితే దాని వివరాలేమిటి?..దేశంలో డిస్కమ్‌లను ప్రైవేటీకరించడానికి ఏదైనా ప్రతిపాదన ఉందా?..అలా ఉంటే అందుకు కారణాలేమిటని ఈనెల 9న రాజ్యసభలో ఎంపి వేమిరెడ్డి ప్రశ్నలు సంధించారు. అందుకు విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ స్పందిస్తూ అయిదు సంవత్సరాల్లో 3,05,985 కోట్ల రూపాయల బడ్జెట్‌తో సంస్కర ణలు మరియు ఫలితాలతో అనుసంధానమైన విద్యుత్ పంపిణీ సెక్టార్ పథకం ప్రతిపాదించామని, ఈ పథకం మౌలిక సదుపా యాల కల్పన మరియు నవీకరణ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్, ఫీడర్ సెపరేషన్, వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేయడం తదితర విష యాల్లో డిస్కమ్‌లకు సహాయం అందిస్తుందని, నిధుల విడుదల వాటి పనితీరు మెరుగుదలతో ముడిపడివుంటుందని పేర్కొన్నారు.

## మాంసపు వ్యర్థాలు, జంతు కళేబరాలతో...

# గబ్బుకొట్టిపోతున్న పెన్నానది

➤ పరిశీలించిన కార్పొరేషన్ అధికారులు

➤ వ్యర్థాల తొలగింపు



**అసలే మురుగు.. ఆపై చెత్త.. ఈ దరిద్రాలు చాలవన్నట్లు కుప్పలు తెప్పలుగా జంతు కళేబరాలు... వీటన్నిటి దుర్గంధంతో పవిత్రమైన పెన్నానది గబ్బుకొట్టిపోతోంది. అధికారులు ఎంత నిఘాపెట్టినా మాంసం మాఫియా పేట్రేగిపోతూనే ఉంది. నిత్యం వందలాది జంతువుల మాంసాన్ని మార్కెట్లకు తరలిస్తూ ధనార్జన చేస్తూనే ఉంది. ఆ మాంసం వ్యర్థాలన్నీ చివరికి పెన్నానదిలో విసిరేయడంతో... అధికారులు ఈ ప్రాంతాలను పరిశీలించి ఆ మాంసపు వ్యర్థాలన్నిటినీ డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.**

నెల్లూరు నగరంలోని బోడిగాడితోట సమీపంలోని పెన్నానది తీరంలో వందలాది జంతుకళేబరాలతో ఆ చుట్టుపక్కల ఉన్న ప్రజలు పడే అవస్థలు అన్నీన్నీ కావు. జంతువులను కోసి మాంసం అమ్ముకునే కొందరు వ్యక్తుల ధనదాహానికి అనేక జంతువులు బలికావడమే కాక, ఆ మాంసం వ్యర్థాలతో పెన్నానది తీరం దుర్గంధంతో నిండిపోతోంది. ఈ వ్యర్థాల వల్ల తాగేనీరు కలుషితం అవుతున్నాయి. పెన్నానదిలో కుళ్ళిపోయిన మాంసం, ఎండిపోయిన ఎముకలు భారీస్థాయిలో ఇక్కడ ఉన్నట్లు గమనించిన కొందరు స్థానికులు అధికారులకు సమాచారం అందివ్వడంతో ఈనెల 7న కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగి పెన్నా నదిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. బోడిగాడితోట ప్రాంతం వద్ద నది గట్టుమీద, నదిలోనూ గుట్టలు గుట్టలుగా పడివున్న మాంసం వ్యర్థాలను చూసి నిర్ఘాంతపోయారు. వాటిని వాహనాల్లో తరలిస్తున్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు పారిపోయారు. మరికొందరు కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణతో వాగ్వాదానికి దిగడంతో, పెన్నానదిలో మాంసం వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తప్పవని వారిని ఆయన గట్టిగా హెచ్చ రించారు. మాంసపు వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించి, వాటిని నిర్వీర్యం చేసి మట్టిలో పూడ్చి పెట్టారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# పిఎస్ఎల్వి-సి51 సిద్ధం

## ఈనెల 28న ప్రయోగానికి సమాయత్తం



శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ నెల 28న పిఎస్ఎల్వి-సి51 రాకెట్‌ను ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. ఆరోజు ఉదయం 10 గంటలా 24 నిమిషాలకు పిఎస్ఎల్వి-సి51 ప్రయోగించా లని నిర్ణయించినట్లు ఇస్రో ఛైర్మన్ శివన్ ఇటీవల ఢిల్లీలో పేర్కొన్నారు. ఈ రాకెట్ ద్వారా బ్రెజిల్‌కి చెందిన అమెజోనియా-1 ఉపగ్రహంతో పాటు, భారత్‌కు చెందిన 3 ఉపగ్రహాలను పిఎస్ఎల్వి సి-51 నింగిలోకి మోసుకువెళ్తుందని, ఈ మూడు ఉపగ్రహాల్లో ఒకటి దేశీయంగా తయారుచేసిందేనని ఆయన తెలిపారు. అమెజోనియా-1 ఉపగ్రహం పూర్తిగా బ్రెజిల్ రూపొందిం చిందని, ఇది భూమిపై పరిశోధనలు చేస్తుందని, దీంతో పాటు మనదేశం తయారుచేసిన ఆనంద్, సతీష్‌ధవన్, యూనిటీశాట్ ఉపగ్రహాలను కూడా కక్ష్యలో ప్రవేశపెడతామన్నారు. ఇండియన్ స్పేస్ స్టార్టప్ పిక్సల్ 'ఆనంద్' ఉపగ్రహాన్ని రూపొందించగా, చెన్నైకి చెందిన స్పేస్ కిడ్జ్ ఇండియా 'సతీష్‌ధావన్' ఉపగ్రహాన్ని రూపొందించిందని, యూనిటీశాట్ ఉపగ్రహంతో పాటు, దీనిలోనే మరో మూడు ఉపగ్రహాలుంటాయని, వీటిని జెప్పియార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-శ్రీపెరంబుదూర్, జిహెచ్ రాయి సోనియ కాలేజ్ ఆఫ్ ఇంజ నీరింగ్-నాగ్‌పూర్, శ్రీశక్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ-కోయంబత్తూరు వారు తయారుచేసిన ఉపగ్రహాలని పేర్కొన్నారు. పిఎస్ఎల్వి-సి 51 ప్రయోగం ద్వారా దేశంలోని తొలి వాణిజ్య ప్రైవేట్ రిమోట్‌సెన్సింగ్ ఉపగ్రహం(ఆనంద్)ను నింగిలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారన్నారు.

## తొలివిడత 9 మండలాల్లో..

# 80.62 శాతం పోలింగ్



జిల్లాలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో తొలివిడతగా ఈనెల 9న కావలి డివిజన్‌లోని 9 మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ మండలాల్లో 80.62 శాతం పోలింగ్ జరిగినట్లు సమాచారం. వరికుంటపాడు మండలంలో 84.75 శాతం పోలింగ్‌తో ఈ మండలం ప్రథమస్థానంలో నిలవగా, అల్లూరు మండలం 73.77 శాతం పోలింగ్‌తో చివరిస్థానంలోకి వచ్చింది. కావలి మండలంలో 83.7 శాతం, బోగోలు మండలంలో 78.59 శాతం, జలదంకి మండలంలో 82.5, దగదర్తి మండలంలో 82.33, దుత్తలూరు మండలంలో 78.33 శాతం, కలిగిరి మండలంలో 81.89 శాతం, కొండాపురం మండలంలో 77.68 శాతం పోలింగ్ నమోదైంది.

# కామాక్షితాయి సేవలో ఐటి కమిషనర్

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆదాయపన్ను శాఖ కమిషనర్ పీయూష్ సోంకర్ తన కుటుంబసభ్యులతో ఈనెల 8న జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఇఓ ఏవి శ్రీనివాసులురెడ్డి ఆయనకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వారి కుటుంబసభ్యులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ ఎస్‌కె సెంథిల్ కుమార్, జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి బాలేశ్వరసింగ్ తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు కబుర్లు

'రథసప్తమి'నాడు

## రంగనాధునికి సప్తవాహన సేవలు



నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో రథసప్తమి పుణ్యదినాన్ని పురస్కరించుకుని ఈనెల 19న స్వామివారికి సప్తవాహన సేవలు నిర్వహిస్తామని ఇఒ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటలకు సూర్యప్రభ వాహనసేవ, 9 గంటలకు గరుడసేవ, 11 గంటలకు సింహవాహనం, 12 గంటలకు హంస వాహనం, 1 గంటకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3.30 గంటలకు బంగారు తిరుచ్చి, సాయంత్రం 4.30గంటలకు పెద్దశేష వాహనం, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనసేవలుంటాయని పేర్కొన్నారు.

మా కష్టాన్ని గుర్తించి..

## వేతనాలు పెంచండి మహాప్రభో!..

ప్రభుత్వానికి వలంటీర్ల విజ్ఞప్తి

తమ కష్టాన్ని గుర్తించి వేతనాలు పెంచాలని పలువురు వలంటీర్ల అధికారుల ఎదుట తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. తమకు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం చాలడంలేదని వారు పేర్కొంటూ తమ వేతనాలను కనీసం 12వేలకు పెంచాలని వారు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తమకు వాలంటీర్ల పోస్టులు ఇచ్చి తమ జీవితాలకు ఎంతో మేలు చేశారని, అయితే వేతనాలు మాత్రం చాలడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల పెంపు కోసం నెల్లూరు నగరంలోని సచివాలయాల వలంటీర్లు అనేకమంది కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఈనెల 9న ధర్నాందోళన నిర్వహించి కార్పొరేషన్ మేనేజర్‌కు సమస్యల వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సానుభూతితో తమ సమస్యలు పరిష్కరించాలని, తమను పర్మనెంట్ ఉద్యోగులుగా పరిగణించాలని కూడా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం దళారుల పాలుకాకుండా చూడండి

రైతులు ఆరుగాలం కష్టించి పండించుకుంటున్న ధాన్యం దళారుల పాలుకాకుండా చూడాలని, పండిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ కోరారు. ఈనెల 9న నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో జిల్లాలో సుమారు 8 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 20 లక్షల మెట్రిక్ టన్నులకు పైగానే ఉత్పత్తి జరుగుతుందని అంచనా అని అంటూ, ప్రభుత్వం రైతుల వద్దనుంచి ఏ-గ్రేడ్ ధాన్యానికి పుట్టికి 16,048 రూపాయలు, బి-గ్రేడ్ ధాన్యానికి పుట్టికి 15,878 రూపాయలు ప్రకటించి కొనుగోలు చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల

## ఆత్మీయ సమ్మేళనం

నెల్లూరు నగరంలోని ఆదిత్య విద్యాసంస్థల్లో 2009-12 సంవత్సరాల మధ్య డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈనెల 7వ తేది ఆదివారం నాడు ఆత్మీయంగా కలుసుకుని తాము చదువుకున్న రోజుల నాటి ముచ్చట్లు చెప్పుకుని ఆనందించారు. పూర్వ విద్యార్థి గౌస్‌బాషా ఈ సందర్భంగా మ్యూజికల్ షోతో అందరినీ అలరించాడు. పూర్వవిద్యార్థులు శివారెడ్డి, విజయభాస్కర్, శివరామకృష్ణ తదితరులతో పాటు కళాశాల డైరెక్టర్ మంచికంటి కృష్ణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర కార్పొరేషన్

## సెక్రటరీగా హేమావతి

నెల్లూరు నగరపాలక సంస్థ సెక్రటరీగా హేమావతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న ఉత్తర్వులిచ్చింది. గిద్దలూరు మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేయడంతో గత ఏడాదిగా ఖాళీగా ఉన్న సెక్రటరీ పోస్టు భర్తీ అయినట్లే!..

## చేపల మార్కెట్‌కు 2.79 కోట్లు

నెల్లూరు, డైకస్‌రోడ్డులో ఉన్న చేపల మార్కెట్ అభివృద్ధికి 2.79 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఈనెల 9న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

చెత్త తరలించేందుకు

## త్వరలో కొత్త వాహనాలు

15 కోట్లతో ప్రణాళికలు - మంత్రి అనిల్



నెల్లూరు నగరంలో చెత్తాచెదారం పెరిగిపోతోంది. ఎప్పటికప్పుడు ఆ చెత్తనంతా తొలగించాలన్నా కార్పొరేషన్ వద్ద చాలినన్ని వాహనాలు లేవు. ఈ పరిస్థితిని గమనించిన మంత్రి డాక్టర్ అనిల్ చెత్త తొలగించేందుకు త్వరలో కొత్త వాహనాలు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 48వ డివిజన్‌లోని కుక్కలగుంట ప్రాంతంలో పర్యటించారు. అక్కడున్న కార్పొరేషన్ వాహనాల షెడ్‌ను పరిశీలించారు. చెత్త సేకరించే పలు వాహనాలు మరమ్మతులకు గురై ఉండడాన్ని గమనించిన మంత్రి, వాటిని బాగుచేయించి వాడకంలోకి తెస్తామన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు అన్ని విధాలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఈ వాహనాల షెడ్ వల్ల స్థానికులకు ఇబ్బందిగా ఉండడంతో, దానిని అల్లీపురం వద్ద ఉన్న పాత డంపింగ్‌యార్డ్‌లోకి మార్చేందుకు కృషి చేస్తామని, అక్కడే రెండెకరాల స్థలం కేటాయించి రెండుకోట్ల రూపాయలతో కొత్త షెడ్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కార్పొరేషన్ ఎస్ఇ శ్రీనివాస సంజయ్, ఎంహెచ్ఒ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వలంటీర్ల

## తొలగింపు

ప్రభుత్వ పథకాలకు, విధానాలకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో మెసేజ్‌లు పెడుతున్న ఇద్దరు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న 7వ డివిజన్ పప్పులవీధి జయప్రకాష్ వీధిలోని 3వ సచివాలయంలో వలంటీర్లుగా పనిచేస్తున్న ఎం.నాగార్జున, కె.నవీన్‌లు వలంటీర్లను ఇతర వలంటీర్లను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారంటూ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ప్రసాద్ ఈనెల 7న వారిని విధుల నుంచి తొలగిస్తూ చర్యలు తీసుకున్నారు. వారివద్ద నుంచి మొబైల్, థంబ్ డివైజ్, ఐడి కార్డును తిరిగి తీసుకుని వారి లాగిన్‌లను వెంటనే బ్లాక్‌చేయాలని ఆ వార్డు అధికారులను ఆయన ఆదేశించారు.

## ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు సమీపంలోని బుజబుజనగర్‌లో ఈనెల 7న ఉచిత వైద్యశిబిరం నిర్వహించి పేద రోగులకు మందులు పంపిణీ చేశారు. బద్దెపూడి చిన్నసుబ్బయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో వైద్యులు బద్దెపూడి సురేంద్ర, బి.రాఘవేంద్ర, నాగరాజారావు, చందన్ రెడ్డి పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

తిక్కన భవన్‌కు

## ప్రారంభోత్సవం

నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో తిక్కన భవన్ పేరుతో నిర్మించిన బహుళ ప్రయోజన భవనానికి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ప్రారంభోత్సవం చేశారు. 'స్పందన' పేరిట జరిగే అర్జీల స్వీకరణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు వీలుగా, కనీసం 250 మందితో సమావేశాలు నిర్వహించుకునేందుకు అనువుగా భవన నిర్మాణం జరిగింది. ఈ భవనానికి కవిబ్రహ్మ తిక్కన పేరుతో 'తిక్కన భవన్'గా పేరు పెట్టడం విశేషం. ఈ భవనం ప్రారంభోత్సవంలో కలెక్టర్‌తో పాటు జేసీలు హరీంద్ర ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రోజ్ మాండ్, డిఆర్ఓ నాగేశ్వరరావు, కెఆర్‌సిసి డెప్యూటీ కలెక్టర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ కాలేజీ

## సమస్యలు తీర్చాలి

- ఎస్ఎఫ్ఐ వినతి

నెల్లూరు నగరంలోని విఆర్ కాలేజీలో నెలకొనివున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఆమేరకు కలెక్టరేట్‌లోని డిఆర్ఓ నాగేశ్వరరావుకు ఈనెల8న వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సనత్‌తో పాటు రాజేష్, ప్రశాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణచైతన్య విద్యార్థినికి..

## అభినందనల వెల్లువ

- ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో జ్యోత్స్న ప్రతిభ
- ప్రశంసించిన ముఖ్యమంత్రి జగన్

దేశ రాజధాని ఢిల్లీలో గతనెల 26న రిపబ్లిక్ దినోత్సవం రోజున జరిగిన వేడుకల్లో పాల్గొన్న నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థిని జ్యోత్స్న ఎంతో ప్రతిభ కనపరచి జిల్లాకే కాక రాష్ట్రానికే గర్వకారణంగా నిలచి అందరి అభినందనలు అందుకుంటోంది.

జ్యోత్స్న ఈ కళాశాలలో బిఎస్సీ మూడవ సంవత్సరం చదువుతోంది. గణతంత్ర వేడుకల్లో దేశస్థాయిలో ఏపి ఎన్‌సిసి బ్యానర్‌ను సాధించడమే కాకుండా రాష్ట్ర ఎన్‌సిసి డైరెక్టరేట్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి 10 కోట్ల రూపాయల అవార్డు సాధించడంలో ఆమె కీలకపాత్ర పోషించింది. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆ విద్యార్థినిని అభినందించి రెండు లక్షల రూపాయల ప్రోత్సాహకాన్ని కూడా అందజేశారని, ఈ విషయం తమ కళాశాల ప్రతిష్ఠను మరింత పెంపొందించిందటూ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఈ వేడుకలకు జ్యోత్స్న మాత్రమే ఎంపికైందని, రాష్ట్రం నుంచి పాల్గొన్న 9 మందిలో తమ కళాశాల విద్యార్థి ఒకరు కావడం తమకెంతో గర్వకారణమని అంటూ ఇటీవల కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో జ్యోత్స్నను ఘనంగా సన్మానించి వారు తమ ఆనందాన్ని విద్యార్థులందరితో పంచుకున్నారు. అదేవిధంగా కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి విభాగం విద్యార్థులు సిహెచ్ పార్థసారధి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచి అవార్డును సాధించారని, బి.రాజేష్, పి.చైతన్య జిల్లాస్థాయిలో ఉత్తమ వలంటీర్లుగా అవార్డులు సాధించారని వారు పేర్కొన్నారు. ఎన్‌సిసి విభాగంలోని విద్యార్థులు బి.రాజేష్, సిహెచ్ పార్థసారధి, అఖిల్, హేమంత్, ఆయూబ్ ఆలీ, జోణ, షఫి, కావ్య, తస్లీమాబాను, పవన్‌కల్యాణ్‌లు అనేక రాష్ట్ర, జాతీయస్థాయి క్యాంప్‌లలో కూడా పాల్గొనే అవకాశాన్ని సాధించుకున్నారని వారు ప్రశంసించారు. ఉత్తమ అవార్డులు సాధించిన విద్యార్థులందరినీ కళాశాల యాజమాన్యం తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ సుధారాణి, ప్రిన్సిపాల్ ఎన్ కృష్ణకుమార్, ఎస్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించండి

జేసీకి బిజెపి నాయకుల వినతి



జిల్లాలో రబీ సీజన్‌లో పండిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు దళారులు, మిల్లర్లపై ఆధారపడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కనీస మద్దతు ధర ఇవ్వాలని బిజెపి కిసాన్ మోర్చా నాయకులు ఇటీవల జేసీ హరేందిర ప్రసాద్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. అదేవిధంగా జిల్లాలోని మెట్టప్రాంతాల్లో పండించిన మినుము పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని విజ్ఞప్తిచేశారు. బీజేపీ నాయకులు కె.బసిరెడ్డి, కె.ఆంజనేయరెడ్డి, పి.సురేంద్ర రెడ్డి, కె.మాధవ్ పాల్గొన్నారు.

## నిరుపేద వృద్ధులకు ఆర్యవైశ్య సంఘం సాయం

నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న నగరంలోని 25 మంది నిరుపేద వృద్ధులకు 500 రూపాయల వంతున ఆర్థిక సాయం అందించారు. సంఘం అధ్యక్షుడు సీతారామారావు, కార్యదర్శి మురళి, జనార్దన్‌తో పాటు మాజీ అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, సంఘం సభ్యులు భాస్కర్, బాబు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో ప్రతిష్టాత్మకమైన..

# 'వదాన్యత' పురస్కారం అందుకున్న ఎంపి ఆదాల



**ప్రముఖ దాత, మానవతా హృదయుడు.. నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డికి ఎంతో అరుదైన గౌరవం దక్కింది. ఆయన వదాన్యతకు, కరోనా బాధితులకు సేవలందించిన సహృదయతకు, ఆయన చేస్తున్న నిర్విరామ ప్రజాసేవలకు గుర్తింపుగా ఎంతో విశిష్టమైన 'వదాన్యత' అవార్డు లభించింది. ఢిల్లీలోని 'గవర్న్-ఐ డెమోక్రసీ' అనే సంస్థ వారు ఆయనకు ఈ అవార్డును బహుకరించారు. ఢిల్లీలోని రాజ్‌భవన్ వద్ద ఆ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా ఇటీవల ఆదాల ఈ అరుదైన పురస్కారాన్ని అందుకున్నారు.**

గత ఏడాది కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా అత్యధిక మొత్తంలో బాధితులకు సొంత నిధులను, సేవలను అందించిన 25 మంది ఎంపీలను ఈ సంస్థ తన సర్వే ద్వారా గుర్తించగా, అందులో 74 పాయింట్లు సాధించిన నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ద్వితీయ స్థానం సాధించడం తెలిసిందే. ఇందులో ప్రధమస్థానం ఎంపీ అనిల్‌ఫిరోజియాకు లభించగా, మూడవస్థానం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి లభించింది.

## కరోనా కష్టకాలంలో.. వేలాదిమందిని ఆదుకున్నారు

కరోనా కష్టకాలంలో నెల్లూరులో చిక్కుకుపోయిన ఇతర ప్రాంతాలకు చెందిన వందలాది వలస కూలీలను, ఉద్యోగులను వారి స్వస్థలాలకు పంపడం, అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న ఎంతోమంది నెల్లూరీయులను నెల్లూరుకు రప్పించడంలో ఆదాల, ఆయన అనుయాయులు ఎంతగానో శ్రమించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాక, ఆదాల తన సొంత నిధులను 20లక్షల రూపాయలను అప్పట్లో కరోనా బాధితుల సహాయార్ధం నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు అందజేసి తన వితరణ గుణాన్ని, సేవాభావాన్ని చాటుకున్నారు. అదేవిధంగా 'ఏపిఆర్ హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థ ద్వారా కరోనా రోగుల కోసం ఒక రోబోను, ఖరీదైన ఎన్-95 మాస్కులను వేలాదిగా తెప్పించి వైద్యులకు, వైద్య సిబ్బందికి, పోలీసుశాఖకు అందజేయడం, ప్రకాశం జిల్లాలోని కందుకూరు నియోజకవర్గంలో ఉన్న కరోనా బాధితుల కోసం మూడులక్షల రూపాయలు ఆర్ధికసాయంగా అందజేయడంతో కరోనా బాధితుల కోసం ఇంత విశిష్టమైన కృషిచేసిన ఎంపీగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆ సంస్థ సర్వేలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆదాల అభిమానులు కూడా అదే స్ఫూర్తితో కరోనా ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు సేవ చేయాలనే దృక్పధంతో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా బాధితులకు తనవంతు సాయం అందించి ఆదుకోవడంలో ఆదాల ఎప్పుడూ ముందుంటున్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మానవీయ హృదయానికి, ఆయన చేస్తున్న ప్రజాసేవలకు గుర్తింపుగా ఆ సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకమైన 'వదాన్యత' అవార్డును ఆయనకు అందజేయడంతో ఆదాల అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల సంక్షేమమే.. సిఎం జగన్ లక్ష్యం



ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 8న కోవూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ 19 నెలల్లో 97వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని, పేదలకోసం ముఖ్యమంత్రి ఎన్నో రకాల సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని ఆయన కొనియాడారు. పార్టీలకు అతీతంగా అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తుండడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తూ, ప్రజల అభ్యున్నతి కోసమే అహరహం శ్రమిస్తున్నారని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త యల్లసిరి గోపాల్‌రెడ్డి, డిఏఏసి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, నాయకులు వినీత్‌కుమార్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, కిషోర్‌సింగ్, నరసింహులురెడ్డి, దండి సురేష్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# ప్రశాంతంగా తొలివిడత పోలింగ్

జిల్లాలో ఈనెల 9న జరిగిన తొలివిడత పంచాయతి ఎన్నికల ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు విస్తృతంగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో పోలింగ్ ఏర్పాట్లను, పోలింగ్ సరళిని పరిశీలించారు. కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కోవూరుపల్లి, ఆముదాలదిన్నె, తుమ్మలపెంట పోలింగ్ కేంద్రాలను కావలి ఆర్డీఓ శ్రీనివాసులుతో కలసి సందర్శించి పోలింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో పంచాయతి ఎన్నికల్లో భాగంగా తొలివిడత పోలింగ్ జరుగుతున్న కావలి రెవెన్యూ డివిజన్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా సాగేందుకు ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటుచేశామని, హెల్ప్ డెస్క్, సైన్‌బోర్డులు, నీడ కోసం షామియానాలు, త్రాగునీరు వగైరాలన్నీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పటిష్టంగా పారదర్శకంగా నిర్వహించడం కోసం 1374మంది ప్రిసైడింగ్ అధికారులను, 1701 మంది పోలింగ్ సిబ్బందిని, 25 మంది జోనల్ అధికారులను, 67 మంది రూట్ అధికారులను, 1665 మంది పోలీస్ సిబ్బందిని నియమించామని, అందరూ సమన్వయంతో పనిచేస్తూ పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కృషిచేస్తున్నారని చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించడానికి, 75 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేశామన్నారు. 311 కేంద్రాల్లో వీడియోగ్రాఫర్లను నియమించామని, 148 చోట్ల మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం ఆరున్నర గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్లలో ఓటర్లు బారులు తీరారని, ఇది మంచి పరిణామమని అన్నారు. ఎంతోమంది వృద్ధులు, కదలలేని స్థితిలో ఉన్నవాళ్ళు కూడా వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని, ఇటీవల ఓటుహక్కు పొందిన యువతతో పాటు, బాలింతలు, గర్భిణులు సైతం ఉత్సాహంగా పోలింగ్‌కు వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారని ఆయన అన్నారు. కోవిడ్ నేపథ్యంలో అన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని, అధికారుల ఆరోగ్యభద్రత కోసం ఫేస్‌మాస్కులు, గ్లౌజ్‌లు, శానిటైజర్లు పంపిణీ చేయడం జరిగిందని, ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చినప్పుడు క్యూ పద్ధతిలో సామాజిక దూరం పాటించేలా చూడడం, థర్మల్ స్కానర్లు ఏర్పాటుచేయడం వంటి అన్ని రకాల ఆరోగ్య చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**పోలింగ్ ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్**





# శ్రీసిటీలో 'ఐలా' సమావేశం

శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) సలహా సంఘం సమీక్షా సమావేశం ఈనెల ఈనెల 8న శ్రీసిటీలో జరిగింది. పరిశ్రమలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు, పారిశ్రామిక పార్కులో అవసరమైన కొన్ని సాధారణ సాంకేతిక సౌకర్యాల గురించిన ప్రతిపాదనలు వగైరాల విషయమై ఈ సమావేశంలో చర్చించారు. ఏపి ప్రభుత్వం శ్రీసిటీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఐలా సంస్థ ద్వారా ఇక్కడ భవన నిర్మాణ ఆమోదాలు, ప్రణాళిక ప్రక్రియల నియంత్రణ ఇక్కడ జరుగుతాయి. ఈ సమావేశానికి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ (ఏపిఐఐసి) జోనల్ మేనేజర్ ఐఎల్ రామ్ అధ్యక్షత వహించారు. ల్యాండ్ అక్విజిషన్ కమిటీ (ఎల్ఏసి) జనరల్ మేనేజర్, శ్రీసిటీ ఐలా కమిషనర్ జె.వెంకటేశ్వర్లు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నాగరాజన్‌తో పాటు పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అందరికీ స్వాగతంచెప్తూ, ఇటీవల శ్రీసిటీ ఐలా కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

# 15 లక్షలతో పాఠశాలకు వసతులు

## - శ్రీసిటీ చొరవతో 'ఐమాప్' పరిశ్రమ వితరణ



శ్రీసిటీ చొరవతో శ్రీసిటీలోని 'ఐమావ్' పరిశ్రమ వితరణతో స్థానిక తొండూరు సొసైటీ మండల పరిషత్ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలలో ఇటీవల కొత్తగా తరగతి గదిని నిర్మించారు. ఇందుకు ఆ పరిశ్రమ 15లక్షల రూపాయలు వెచ్చించింది. స్టూడెంట్ డెస్కులు, బెంచీలు కూడా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఈనెల 8న పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఇవామితో పాటు శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి. రమేష్‌కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్, మండల విద్యాశాఖాధికారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇవామి మాట్లాడుతూ శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు.

# శ్రీసిటీలో మౌలిక వసతులు భేష్

## - ఏపి మారిటైమ్ బోర్డు డెప్యూటి సిఇఓ రవీంద్రనాథ్‌రెడ్డి




శ్రీసిటీలో వ్యాపారానుకూల వాతావరణం ఎంతో సంతృప్తికరంగా ఉందని, ఇక్కడ పరిశ్రమలకు మౌలికవసతులు చాలా బాగున్నాయని ఏపి మారిటైమ్ బోర్డు డెప్యూటి సిఇఓ సిడిఆర్ రవీంద్రనాథ్‌రెడ్డి కితాబిచ్చారు. ఇటీవలే రవీంద్రనాథ్‌రెడ్డి ఏపి మారిటైమ్ బోర్డు డెప్యూటి సిఇఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 9న ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదరస్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా ఎగుమతులను సులభతరం చేయడానికి అంతర్జాతీయ రవాణా వ్యవస్థను మెరుగుచేయాల్సిన ఆవశ్యకతపై ఇరువురు చర్చించుకున్నారు.

# శ్రీసిటీలో పూర్వ కలెక్టర్ రామ్‌గోపాల్



గతంలో నెల్లూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర యువజనాభివృద్ధి, సాంస్కృతికశాఖల ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.రామ్‌గోపాల్ ఈనెల 9న శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాను కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో శ్రీసిటీతో తనకున్న అనుబంధాన్ని రామ్‌గోపాల్ గుర్తుచేసుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధిసాధించిన మెగా ఇండస్ట్రియల్ పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీని తీర్చిదిద్దిన శ్రీసిటీ యాజమాన్య కృషిని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీ అభివృద్ధికి ఆయన అందించిన విలువైన సలహాలు సూచనలను, ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువలేమని ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి అన్నారు.

# పేర్నాటి శ్యామ్ ఔదార్యం

○ విద్యుత్ షాక్‌కు గురైన బాధితుని చికిత్సకు 5 లక్షల విరాళం
○ కోలుకున్న బాధితుడు..కుటుంబసభ్యుల కృతజ్ఞతలు



చిల్లకూరు మండలంలోని చిల్లకూరు దళితవాడకు చెందిన కల్లూరు లోకేష్ అనే యువకుడికి చిల్లకూరు సబ్‌స్టేషన్లో విద్యుత్ షాక్ తగిలి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే! లోకేష్‌కు వెంటనే ప్లాస్టిక్ సర్జరీ చేయవలసిన అవసరం ఉందని వైద్యులు సూచించడంతో లోకేష్ కుటుంబానికి అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో నెల్లూరు అపోలో ఆసుపత్రిలో ప్లాస్టిక్ సర్జరీకి అయ్యే పూర్తిఖర్చును వైసీపీ రాష్ట్ర నేత పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి వితరణగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. పేర్నాటి ట్రస్టు ద్వారా దాదాపు అయిదు లక్షల రూపాయలు బాధితునికి సాయంగా



అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. దీంతో లోకేష్ కోలుకుని ఇటీవల ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ కుటుంబసభ్యులు తమ బిడ్డకు ప్రాణం పోసిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి స్వగ్రామమైన అల్లంపాడుకు వెళ్ళి శ్యామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# 'దర్యాప్తు'లో కోవూరు పోలీసులు భేష్!

డిజిపి చేతుల మీదుగా ఏబిసిడి అవార్డు అందుకున్న సిఐ రామారావు



***కేసుల దర్యాప్తు విషయంలో కోవూరు పోలీసుల ప్రతిభాపాటవాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో ఒక ట్రావెల్స్‌కు సంబంధించిన కారును రిమాండ్ ఖైదీ హరీష్‌రెడ్డి అపహరించిన కేసుకు సంబంధించి ఉత్తమ స్థాయిలో దర్యాప్తు చేయడం ద్వారా డిజిపి నుంచి కోవూరు పోలీసులు ప్రతిష్ఠాత్మకమైన ఏబిసిడి అవార్డును అందుకోవడం విశేషం. ఈ అవార్డు రావడానికి ఓ కిడ్నాప్‌కేసులో జరిగిన ముమ్మర దర్యాప్తే కారణం.***

వివరాలిలా ఉన్నాయి... నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఒక బాలుడి కిడ్నాప్ కేసులో అరెస్టయి రిమాండ్ ఖైదీగా ఉన్న హరీష్‌రెడ్డి జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి పరారయ్యాడు. గాలింపు చర్యలను ముమ్మరం చేసిన పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఒక ట్రావెల్స్‌లో కారును బుక్‌చేసుకుని వెళ్తూ డ్రైవర్ ఆదమరచి ఉన్నప్పుడు కారుతో సహ ఉడాయించేశాడు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని గుర్తించడానికి ఎలాంటి ఆధారాలు లేకపోయినా పోలీసులు ముమ్మరంగా పరిశోధించి ఎట్టకేలకు హరీష్‌రెడ్డి ఎక్కడున్నాడో కనిపెట్టి అరెస్ట్ చేశారు. ఈ దర్యాప్తు ఉత్తమ దర్యాప్తుగా పోలీసు ఉన్నతాధికారుల గుర్తింపులోకి వచ్చింది. ఈ కేసును ఛేదించిన అప్పటి కోవూరు సిఐ జి.రామారావు, ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ (ఏబిసిడి)కు ఎంపికై ఫస్ట్ ప్రైజ్ సాధించి డిజిపి అభినందనలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో 2020 సంవత్సరం మూడవ త్రైమాసికానికి ఏబిసిడిలో ప్రథమస్థానంలో నిలిచి లక్ష రూపాయల రివార్డును కూడా ఈ పోలీసు బృందం అందుకోవడం విశేషం. మంగళగిరిలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో డిజిపి గౌతం సవాంగ్ చేతులమీదుగా అప్పటి కోవూరు సిఐ జి.రామారావు ఈ అవార్డును అందుకున్నారు. ఈ విశిష్టమైన అవార్డులను అందుకున్నవారిలో కోవూరు ఎస్ఐ సిహెచ్ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ ఎం.హసనయ్యమూర్తి, హెడకానిస్టేబుళ్ళు ఎన్.ప్రసాద్, కోవూరు కానిస్టేబుళ్ళు ఎం.చంద్రశేఖర్, సైపుల్లా, జి.మధు, టి.వేణు, నెల్లూరులోని దర్గామిట్ట కానిస్టేబుల్ ఎం.మహేంద్రరెడ్డి, బాలాజీనగర్ కానిస్టేబుల్ ఏ.తిరుపతయ్య, సైబర్ టీం పి.శ్రీరామ్, 'దిశ' మహిళా కానిస్టేబుల్ ఆర్ సాయిశృతి ఉన్నారు. ఏబిసిడి అవార్డుల్లో ప్రథమస్థానంలో నిలిచి జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను మరింతగా పెంచినందుకు జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సంతోషం వ్యక్తం చేస్తూ కోవూరు సిఐ రామారావును, పోలీసు సిబ్బంది ప్రతిభను అభినందించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

ఎన్నికల ప్రక్రియ..

# సజావుగా సాగేలా చూడాలి

- కలెక్టర్ చక్రధర్‌బాబు



ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, జరిగే అవకాశం ఉన్నా వెంటనే 1077ని సంప్రదించాలని కలెక్టర్ తెలియజేశారు. ఇటీవల సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో తొలివిడతలో కావలి డివిజన్, రెండవ విడతలో ఆత్మకూరు డివిజన్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యిందని మూడో విడతలో గూడూరు, నాయుడుపేట డివిజన్‌లలో నామినేషన్ ప్రక్రియ జరుగుతోందని, ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ల ప్రక్రియ జరిగేలా, అలాగే ఎన్నికల ప్రక్రియ కూడా సజావుగా సాగేలా గూడూరు డివిజన్‌లో అన్ని పనులు గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూర్తి చేసినట్టు, ఎన్నికలకు సర్వ సన్నద్ధంగా ఉన్నట్లు, అన్ని శాఖల సమన్వయంతో ఎన్నికలు సజావుగా జరిగేలా చూస్తామని కలెక్టర్ అన్నారు. గూడూరు డివిజన్‌లో 214 పంచాయతీలకు సంబంధించి రెండు లక్షల 80వేలకు పైగా ఓటర్లు సజావుగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు.

# ఎల్ఐసి ఉద్యోగుల ఆందోళన



ఏఐఐఇఎ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 8న భోజన విరామ సమయంలో గూడూరులోని ఎల్ఐసి ఆఫీస్ ఆవరణములో ఐపిఓకు వ్యతిరేకంగా కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ఎల్ఐసి అధికారులు యస్దానీ, శివకుమార్, డిబి శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, దీక్షితులు, రాజశేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు, బ్రాంచ్ మేనేజర్ బాలాజీబాబుతో పాటు పలువురు ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

● ఇన్నర్‌వీల్, ఆంధ్రమహిళా మండలి సేవలు

# నిరుపేద విద్యార్థినులకు యూనిఫాంలు



గూడూరులోని ప్రముఖ సేవాసంస్థలు ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ఈనెల 9న 25 మంది నిరుపేద విద్యార్థినులకు యూనిఫారం దుస్తులు పంపిణీ చేశారు. గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఇక్కడ చదువుకున్న రమణమ్మ అనే నిరుపేద విద్యార్థిని ఇప్పుడు ఎంసిఏ చదువుకుంటోంది. ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ విద్యార్థిని బాగా చదువుకునేందుకు తమ వంతు సాయంగా 5 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ కమల సాయి, సెక్రటరీ పద్మావతి, ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు రోహిణి, శశికళ, విష్ణు వందన, లక్ష్మి, జమున తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు జేవివి సేవలు



గూడూరులోని జనవిజ్ఞానవేదిక సంస్థ ఆధ్వర్యంలో వడ్డమూడి వెంకట్‌బాబు దాతృత్వంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలకు భోజనాలు (వెజిటబుల్ రైస్, గుడ్డు, బ్రెడ్) ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ద్వారా పంపిణీ చేశారు. జె.వి.వి.వారు సేవాభావంతో ఈ ఆసుపత్రిలో నాలుగు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిరుపేద గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారని ఆసుపత్రి వారు ప్రశంసించారు. కోవిడ్ సమయంలో కూడా జేవివి వారు రక్తదానం చేశారని అంటూ ఈ సందర్భంగా జె.వి.వి. సభ్యులందరికి వారు అభినందనలు తెలిపారు. .ఈ కార్యక్రమంలో జె.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, వడ్డమూడి వెంకట్,ప్రభాకర్, రామమోహన్, చెంచునారాయణ,పురుషోత్తమరావు, వరప్రసాద్, చందు, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మయూరి శ్యామ్‌యాదవ్‌కు గౌరవ డాక్టరేట్

సమాజ సేవకు సముచితమైన సత్కారం

గూడూరుకు చెందిన ప్రముఖ రొటేరియన్, సమాజ సేవాపరాయణుడు మయూరి శ్యామ్‌యాదవ్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. ప్రజలకు, పేదలకు ఆయన ఎంతోకాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు సముచితమైన గుర్తింపు దక్కింది. తమిళనాడు రాష్ట్రంలోని బెంగళూరుకు సమీపంలో ఉన్న హోసూరులో యూనివర్సల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గతనెల 30న నిర్వహించిన ఇండియన్ ఎంపైర్ యూనివర్శిటీ కార్యక్రమంలో ఆయన గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకోవడంతో గూడూరు ప్రజలు, ఆయన అభిమానులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. మద్రాసు హైకోర్టు జడ్జి జస్టిస్ స్వామిదొరై, కర్నాటక స్టేట్ కమిషనర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఛైల్డ్ పర్సన్ వై. మర్రిస్వామి, కన్నడ సినీనటుడు దర్శకుడు కోటి నాగరాజు, మీడియా చాంబర్ ఆఫ్ కౌన్సిల్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎం వేలు తదితరుల సమక్షంలో శ్యామ్ యాదవ్ ఈ విశిష్టమైన గౌరవాన్ని అందుకోవడం విశేషం.



**పేదలకు, కరోనా బాధితులకు నిర్విరామ సేవలు**

2006-07లో రోటరీక్లబ్ గూడూరు మెయిన్‌క్లబ్‌లో సభ్యునిగా గూడూరు పరిసర ప్రాంతాల్లో ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా 2009లో శ్రీకృష్ణ సేవా సమితి అనే స్వచ్ఛంధసంస్థను స్థాపించి కరోనా బాధితులకు, పేదప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. కరోనా కష్టకాలంలో దాదాపు 30 సేవాకార్యక్రమాలు నిర్వహించి బాధితులకు నిర్విరామ సేవలందించి అందరి ప్రశంసలందుకున్నారు.

అంతేకాదు, 2017–19 సంవత్సరంలో సౌత్‌సెంట్రల్ రైల్వే గుంతకల్ రైల్వే డివిజన్‌కు, డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా ఎంపికై రైల్వేస్టేషన్లలో మౌలిక వసతుల కల్పనకు, ప్రయాణీకులకు మెరుగైన సదుపాయాల కోసం కృషిచేశారు. 2020–21 సంవత్సరానికి నూతనంగా సౌత్‌సెంట్రల్ రైల్వే, విజయవాడ రైల్వే డివిజన్‌కు డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ మెంబర్‌గా ఆయన ఎంపికయ్యారు కూడా.

శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షునిగా, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సెక్రటరీగా, గుంతకల్ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మాజీ మెంబర్‌గా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ సముచితమైన గౌరవం లభించింది. తాను చేసే ఈ సేవా కార్యక్రమాలకు ఆ శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులతో పాటు తన కుటుంబసభ్యులు సహకారం, మయూరి స్వీట్స్ అండ్ బేకరి, వనజాకృష్ణ కల్యాణమండపం వారి సహాయ సహకారాలున్నాయని, వారి సహకారం మరువలేనిదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# విలువిద్య పోటీలకు సై!..

## 16న విజయవాడకు నెల్లూరు క్రీడాకారులు



రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకూ సై అంటూ జిల్లా క్రీడాకారులు సిద్ధమవుతున్నారు. నిరంతర సాధనతో రాణిస్తూ ఈ పోటీల్లో విజయం సాధించే దుకు ఉద్యుక్తులవుతున్నారు. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల7న నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. జిల్లాకు చెందిన అనేకమంది విలువిద్యా క్రీడాకారులు ఈ ఎంపికల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇండియన్ రౌండ్‌లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో తరుణేష్, జైత్ర, సాయి శశిధర్, వివిఎస్ కుషన్ చౌదరి, మహబూబ్ మాహేన్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో డి.భాషిత, పి.గేయశ్వని, లక్ష్మీప్రసన్న ఎంపికయ్యారని అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, వేణు తెలిపారు. అదేవిధంగా రికర్వ్ రౌండ్‌లో బాలుర విభాగంలో కెవిఎస్ ఆదిత్య, సిహెచ్ తనుష్, ఆర్ సాయిమౌర్య ఎంపికయ్యారని, బాలికల విభాగంలో ఏ.వినుతి, కె.ప్రియ, వి.సుమ ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. కాంపౌండ్ రౌండ్‌లో బాలుర విభాగంలో ఎంవి సుశాంత్, కె.సూరజ్, వి.మనోజ్, బాలికల విభాగంలో జి.గ్రీష్మ, వి. భూసహస్ర, బి. హేమలత, సిహెచ్ సుశ్రిత ఎంపికయ్యారని వివరించారు. జూనియర్స్ విభాగంలో కాంపౌండ్ రౌండ్‌లో ఎంఎస్ వివేకకుమార్ ఎంపికయ్యాడన్నారు. విజయవాడలో ఈనెల 16 నుంచి 20వ తేది దాకా జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధించేందుకు సమాయత్తమవుతున్న వీరంతా విలువిద్యలో తమ సత్తా చాటుతూ జిల్లాకు మంచిపేరు తెస్తారని ఆశిద్దాం!...

# హరికథా కళాకారులకు పురస్కారాలు

టిటిడి మాజీ ఇఓ, తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ కెవి రమణాచారి 69వ పుట్టినరోజును పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 32 మంది హరికథా కళాకారులను ఎంపికచేసి పురస్కారాలు అందజేశారు. ఇందులో జిల్లాకు చెందిన అయిదుగురు హరికథా కళాకారులున్నారు. వీరిలో చింతా ఈశ్వరశర్మ, భవానిబాయి, వసంతకుమారి, మధు, నాగభూషణంలకు ఇందుకూరుపేటలోని శ్రీ లలిత మహేశ్వరి ఆలయంలో పీఠాధిపతులు శ్రీ రామాయణం మహేష్‌స్వామి చేతుల మీదుగా గౌరవించి నగదు పురస్కారాలను అందజేశారు. కిన్నెర ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'కామధేను' పురస్కారాల కన్వీనర్ మైపాడు రాజా నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. విశ్వహిందూ పరిషత్ సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి పోలవరపు కార్తికేయ, ధన్వి శ్రీనివాస్, రాజా కొండయ్య, సత్యనారాయణతో పాటు అర్చకులు జ్యోతిప్రసాద్, కొండూరు హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రాంతాల్లో సెలవు

జిల్లాలో పంచాయతి ఎన్నికలు జరిగే ఈ నెల 9, 13, 17, 21 తేదీల్లో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 8న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్నికలు జరిగే కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈనెల 9న, అదేవిధంగా ఆత్మకూరు రెవిన్యూ డివిజన్‌లో ఈనెల 13న, గూడూరు-నాయుడుపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఈనెల 17న, నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈనెల 21న వేతనంతో కూడిన సెలవుదినంగా ప్రకటించడం జరిగిందని, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలకు ఈ సెలవుదినం అమలవుతుందని కలెక్టర్ వివరించారు.

## రామమందిర నిర్మాణానికి విరాళాలివ్వండి

అయోధ్యలో రామమందిరం నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మందిర నిర్మాణం ట్రస్ట్ మండల కన్వీనర్ మారెళ్ళ గురుప్రసాద్ కోరారు. ఈనెల 7న వెంకటాచలం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. విరాళాలిచ్చినవారికి రశీదులిచ్చారు. రామమందిర నిర్మాణం ఎంతో పవిత్రమైనదని, ఈ మహత్కార్యానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఏబివిపి నాయకుడు ఉదయ్‌పవన్, సామాజిక సేవా కార్యకర్తలు రాజేశ్వరి, మస్తాన్, చంద్ర పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే..

# శ్రీవారి దర్శనం సులభం!

### ❑ తిరుమలేశుని భక్తులకు తీపివార్త

తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్న దూరప్రాంత భక్తులకు ఆర్టీసి తీపివార్తను అందించింది. ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు వెళ్తే చాలు.. శ్రీవారి దర్శనం కూడా త్వరగానే లభిస్తుంది. సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే భక్తులకు తిరుమలేశుని శీఘ్రదర్శనం సౌకర్యాన్ని కలిగించేందుకు ఆర్టీసి అన్ని ఏర్పాట్లు చేసి శ్రీవారి భక్తుల్లో ఆనందాన్ని నింపింది. తిరుపతికి వెళ్ళేందుకు చెల్లించాల్సిన టిక్కెట్ ధరతో పాటు శ్రీవారి శీఘ్రదర్శనానికి అదనంగా 300 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, నెల్లూరు రీజియన్ నుంచి 8 సూపర్ లగ్జరీ బస్సులకు ఈ సదుపాయం కలిగిస్తున్నామని నెల్లూరు ఆర్టీసి రీజనల్ మేనేజర్ సివి శేషయ్య తెలిపారు. టిక్కెట్లను ఆన్‌లైన్‌లోను, ఆర్టీసి రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా కూడా పొందవచ్చని ఆయన భక్తులకు సూచించారు.

# విఆర్‌ఏల జీతం పెంచాలి

గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఏ)లకు కనీస వేతనం రూ. 21వేలు ఇవ్వాలని కోరుతూ జిల్లా విఆర్‌ఏల సంఘం గౌరవాధ్యక్షుడు పెంచలనరసయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బయ్య డిమాండ్ చేశారు. నెల్లూరులోని సిఐటియు కార్యాలయంలో ఈనెల 7న జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ విఆర్‌ఏలకు జీతాలు పెంచుతామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్ళయినా హామీ అమలుకాలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సంఘం నాయకులు శ్రీనివాసులు, బాషా, భాస్కర్, అంకయ్య, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 'ఈ-క్రాప్' నమోదు తప్పనిసరి

### వ్యవసాయశాఖ డి.డి ప్రసాద్

రైతులు తమ పంటలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు 'ఈ-క్రాప్'లో నమోదు చేసుకోవాలని, అలా చేసుకున్న రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలన్నా, సబ్సిడీలు పొందాలన్నా రైతులు 'ఈ-క్రాప్'లో నమోదు చేసుకుని ఉండాలని వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు చెప్పారు. ఈనెల 8న ఆయన కోవూరు మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశమై 'ఈ-క్రాప్' పట్ల రైతులకు అవగాహన కలిగించారు. ప్రతి రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాము పండించిన పంటలను అమ్ముకోవాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. జిల్లాలో వరికోతలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులు వారి గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను అమ్ముకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పట్ల రైతులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

# భక్తవరదుడు..'గూడలి' భీమేశ్వరుడు

***భక్తుల కోర్కెలు నెరవేర్చే భక్త వరదుడు.. మహాదేవుడైన ఆ పరమేశ్వరుడు భీమేశ్వరుడుగా కొలువై ఉన్న ప్రాంతం నెల్లూరుజిల్లాలోని గూడలి గ్రామంలో ఉంది. కోట మండలంలోని 'గూడలి' ఒక చిన్న గ్రామమే అయినా.. ఆధ్యాత్మికపరంగా ఇదెంతో గొప్ప విశిష్టమైన ప్రాంతం. గూడూరు డివిజన్‌లోనే అతిపెద్ద కొండగా పేరున్న గూడలి కొండ ప్రాంతమంతా శ్రీ భీమేశ్వరస్వామి చల్లని కరుణా కటాక్ష వీక్షణాలతో ఎంతో సుప్రశాంతంగా..ఆహ్లాదకరంగా ఉంటుంది. స్వామివారికి జరిగే నిత్యపూజలతో పాటు.. ఏటా జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తజనసందోహంతో గూడలి భీమేశ్వరాలయం ఎల్లవేళలా కళకళలాడుతూ ఉంటుంది.***

జిల్లాలోని కొండలపై ఉన్న పలు ప్రాచీన ఆలయాల్లో గూడలి కొండ శ్రీ భీమేశ్వరాలయం ఒకటి. పాతకాలంలో ఈ ప్రాంతానికి 'కూడలి' అని పేరు. స్వర్ణముఖి, చల్లకాలువ రెండూ ఇక్కడ కలుస్తాయి కనుక రెండు ఏరుల కూడలిగా ఉండేది. అదే కాలక్రమేణా 'గూడలి' అయిందని అంటారు. ఇక్కడ జనార్దనస్వామి, సంగమేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి దేవాలయాలున్నాయి. గూడలి కొండ ప్రాంతం కనుక ఎంతో చక్కని ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ప్రాచీనకాలంలో ఇక్కడ రుషులు తపస్సు చేసుకునేవారని, యజ్ఞయాగాదులు కూడా చేసేవారని, అందువల్ల ఇదెంతో పవిత్రమైన ప్రాంతమని అందరూ భావిస్తుంటారు.

### పచ్చదనంతో విలసిల్లే గూడలి కొండ :

గూడలి కొండ ఘాట్‌రోడ్డు మలుపులతో తిరుమల కొండను తలపిస్తూంటుంది. చుట్టూ పెద్దపెద్ద వృక్షాలతో, కొబ్బరిచెట్లు, మామిడి తోటలతో అంతా పచ్చదనం పరుచుకుని ప్రకృతి రమణీయకత ఉట్టిపడుతూ భక్తులను, పర్యాటకులను బాగా





మన దేవాలయాలు 33

ఆకట్టుకుంటుంది. ఈ కొండపై నుంచి చూస్తే దూరంగా..గలగల ప్రవహించే స్వర్ణముఖి నది ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. కొండ చుట్టూతా ఉన్న చిన్న చిన్న గ్రామాలు, ఇళ్ళు అన్నీ ఎంతో అందంగా బొమ్మలకొలువును తలపించేలా కనిపిస్తుంటాయి.

### అగస్త్యమహర్షి ప్రతిష్టించిన ఆలయం :

గూడలి కొండపై కొలువైవున్న శ్రీ భీమేశ్వరాలయంలోని శివలింగాన్ని ప్రాచీన కాలంలో అగస్త్యమహర్షి ప్రతిష్టించారని చరిత్ర. తపస్సు చేసేందుకు ఈ ప్రాంతానికి వచ్చిన అగస్త్యమహర్షి గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలో స్నానమాచరించి ఇక్కడ తన స్వహస్తాలతో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారని అంటారు. అప్పట్లో ఈ నదిలో మరోరెండు నదులు కూడా ఇక్కడ కలుస్తుండడంతో ఈ ప్రాంతానికి ఆ మహర్షే 'కూడలి' అని నామకరణం చేశాడని కూడా చెప్తుంటారు. ఆ తర్వాత కాలంలో ఈ ప్రాంతానికి వచ్చిన తొండమనాడు చక్రవర్తి ఈ శివలింగాన్ని చూసి, ఎంతో మహిమాన్వితమైన శివలింగంగా గుర్తించి ఆలయం నిర్మించాడని పెద్దలు పేర్కొంటున్నారు. ఈ ఆలయం ఎంతో శిల్పకళా నైపుణ్యంతో అలరారుతూ ఉంటుంది. గూడలిలో మరో పురాతనమైన ఆలయం కామాక్షిదేవి సమేత శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది. ఈ రెండు ఆలయాలు పరమశివుడు కొలువైవున్న ఆలయాలుగా ప్రతీతి. ఎంతో కాలం నుంచి భక్తులు స్వామివార్లకు నిత్యపూజలు, ఏటా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా చేస్తున్నారు. గూడూరు డివిజన్‌లోనే అతిపెద్దదైన ఈ గూడలి కొండ ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగానే కాక, పర్యాటకంగా కూడా అభివృద్ధి చేసేందుకు స్థానిక ప్రముఖులు కృషిచేస్తున్నారు.

### నేత్రపర్వంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

గూడలి కొండపై ప్రతిఏటా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతుంటాయి. ప్రత్యేకించి ఈ ఉత్సవాల్లో కల్యాణోత్సవం రోజున వివాహాలు చేసుకుంటే శుభప్రదం కనుక ఎంతోమంది కొత్తజంటలు ఆరోజున ఇక్కడికి వచ్చి శ్రీ భీమేశ్వరస్వామి సన్నిధిలో పెళ్ళిళ్ళు చేసుకుంటుంటారు. కన్నులపండువగా జరిగే శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలకు కోట మండలం నుంచే కాక జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది భక్తజనం గూడలికి వచ్చి శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుకుని తరిస్తుంటారు. గూడలి కొండపైకి పాతకాలం నుంచి మెట్ల దారి కూడా ఉండడంతో యువకులు ఎంతో ఉత్సాహంగా ఈ మెట్లెక్కి స్వామివారిని దర్శించుకుంటూ ఉంటారు. ఇటీవలి కాలంలో రోడ్డు కూడా వేయడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా గూడలి కొండపైకి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవుతుంటారు.

# ఇంతకీ ఒక తాటిమీదకు వస్తారా?

'జనసేన' పేరిట ఒక రాజకీయ పార్టీని పెట్టుకుని వచ్చే 20,30,40,50 ఏళ్ళల్లో అయినా రాణించక పోతానా అన్న భరోసాతో రాజకీయం చేస్తున్న - చిరంజీవి సోదరుడు- చిరంజీవి పవన్‌కళ్యాణ్‌కు వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అంటే పరమ మంట. సందర్భం దొరికితే చాలు- జగన్‌ను విమర్శించే అవకాశాన్ని ఆయన వదులుకోరు. తాను రెండు అంటే-జగన్ నాలుగు అంటారని తెలిసినా కూడా- జగన్‌ను విమర్శించడం అంటే ఆయనకు మహా సరదా. చంద్రబాబునాయుడు అంటే వల్లమాలిన అభిమానం. సొంతంగా పార్టీ పెట్టుకుని కూడా దానిని పక్కన పడేసి - 2014లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి పవన్ కళ్యాణ్ ఊరూరా తిరిగారు.



2019లో సొంతంగా పోటీ చేశారు గానీ, చంద్రబాబుతో బహిరంగంగా టై-అప్ పెట్టుకోక పోవడంతో- వర్క్ ఔట్ కాలేదు. జనసేన టికెట్ మీద ఒక్కరు మాత్రమే గెలిచారు. అయినప్పటికీ, తన రాజకీయ భవిష్యత్‌పై అచంచలమైన నమ్మకంతో - వచ్చే 20,30,40,50 ఏళ్ళల్లో ముఖ్యమంత్రులం కాకపోతామా అన్న భరోసాతో ఆయన రాజకీయం ఇంకా కొనసాగిస్తున్నారు.




ఇక, సోము వీర్రాజు. బీజేపీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు అధ్యక్షుడు. ఆయనకు చంద్రబాబునాయుడు పేరు చెబితే చాలు- పూనకం వచ్చేస్తుంది. ఏ స్కీంలో ఎన్ని వందల కోట్లు టీడీపీ వాళ్ళు ఎలా తిన్నారో - నిద్రలో లేపి అడిగినా చెప్పేస్తారు. బీజేపీ ఆంధ్ర శాఖకు అధ్యక్షుడిగా నియమితులు కాకముందు నుంచీ ఆయనది అదే బాణి. పనిలో పనిగా - వైసీపీ మీద కూడా లైట్‌గా రెండు డైలాగులు వదులుతారు.

ఇప్పుడు - జగన్‌ను విమర్శించే పవన్ కళ్యాణ్, చంద్రబాబును విమర్శించడంలో గొప్ప ఆత్మానందం పొందే సోము వీర్రాజూ చేతులు కలిపారు. ఈ కలయికకు ఇంకో డైమెన్షన్ (కోణం) కూడా ఉంది. ఇద్దరూ కాపులే.

కోస్తా ఆంధ్ర లో కాపు కులస్తుల జనాభా బాగా ఎక్కువ. అందుకని- 'నీ ఎడం చెయ్యి తీయి. నా పురచేయి పెడతాను' అన్నట్టుగా - బీజేపీ - ఒక కాపుని తీసి ఇంకో కాపును అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టాలని అనుకున్నది. అందుకని, కన్నా లక్ష్మీ నారాయణను దించి, సోము వీర్రాజును ఎక్కించారు.

ఆంధ్ర,రాయలసీమలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి జనాభా ఎక్కువ గనుక- పవన్ కళ్యాణ్ కూడా 2014లోనే రంగంలోకి దిగేశారు. ఈ కాపు యాంగిల్ నుంచే- సోము వీర్రాజు, పవన్ కళ్యాణ్‌ను - బీజేపీ కేంద్ర నాయకత్వం ఒక గూటికి చేర్చింది. మరి, ఈ ఇద్దరూ చెరో పక్కకు లాగుతుంటే- వచ్చే ఎన్నికల్లో గెలిచేదెట్టా? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేదెట్టా? అమరావతి రైతులకు న్యాయం చేసేదెట్టా? గెలుపుకు కావలసిన 45, 48శాతం ఓట్ల శాతాన్ని సాధించేదెట్టా?!.

మరి అంత శాతం ఓట్లు వస్తేగాని, అధికారంలోకి రాలేరు. చంద్రబాబు పార్టీకి మొన్న 40 శాతం ఓట్లు వచ్చాయి. అయినా సీట్లు మాత్రం ఇరవై మూడే వచ్చాయి.

పవన్ కళ్యాణ్‌కు మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో 6 శాతం ఓట్లు లభించాయి. బీజేపీకి ఒక శాతం అనుకుందాం(అంత కూడా రాలేదు.).

సరే. ఏడు శాతం అనుకుందాం. పోనీ 10 శాతానికి పెరిగింది అనుకుందాం. ఈ 10, 12 శాతానికి ఎన్ని సీట్లు వస్తాయి?

అధికారంలోకి వచ్చే విషయం కాసేపు పక్కన పెడితే బీజేపీ-జనసేనకు రాష్ట్రంలో రాజకీయ శత్రువు ఎవరు అనే విషయమై ఆ రెండూ ముందు ఏకాభిప్రాయానికి రావాలి. ఇద్దరూ కలిసి ఒక సంయుక్త ప్రకటన జారీ చేయాలి. 'ఇదిగో... ఇదే మా రాజకీయ శత్రువూ' అని. ఆ పని వాళ్ళు చేయరు. ఎందుకంటే- చంద్రబాబును నొప్పించడం పవన్ కళ్యాణ్ కు ఇష్టం ఉండదు. జగన్‌ను నొప్పించడం సోము వీర్రాజుకు ఇష్టం ఉండదు. ఎవరు తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అనే విషయం తేల్చుకోకుండానే - తిరుపతి ఉప ఎన్నికలో గెలిచేస్తాం... చింపేస్తాం అంటూ ప్రకటనలు గుప్పిస్తుంటే..... జనం నవ్వుతారు.

పవన్ కళ్యాణ్ ముందు ఆ విషయం చూడాలి.... ఢిల్లీ ఫ్లైట్ ది ఏముంది...? ఎప్పుడైనా ఎక్కవచ్చు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# 'తై అమావాస్య' తిరునాళ్ళ

**శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం**

**వేమాలశెట్టి బావి వద్ద మొక్కులు తీర్చుకున్న భక్తులు**





'తై అమావాస్య' పుణ్యదినాన్ని పురస్కరించుకుని ఈనెల 11వ తేది గురువారం నెల్లూరు దర్గామిట్ట రామ్‌నగర్‌లో ఉన్న శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయం వేలాదిమంది భక్తజనంతో క్రిక్కిరిసిపోయింది. ఈ ఆలయంతో పాటు ఆలయం ప్రాంగణంలో ఉన్న వేమాలశెట్టి బావిని భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి వచ్చి క్యూలైన్లలో బారులు తీరారు. ఆరోగ్యాన్ని ప్రసాదించి, కోరిన కోర్కెలు నెరవేర్చే శ్రీ వైద్య వీరరాఘవ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. చెంతనే ఉన్న వేమాలశెట్టి బావిలో బెల్లం, పూలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎంతో ప్రాచీనమైన, మహిమాన్విత ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఈ 16వ శతాబ్దినాటి ఆలయం, అప్పటి చరిత్రాత్మకమైన వేమాలశెట్టి బావి నేటికీ వేలాదిగా భక్తుల పూజలందుకుంటున్నాయి. ముఖ్యంగా 'తై అమావాస్య' నాడు ఆలయంలోని శివలింగంపై ఉప్పు పోసి పూజలు చేయడం, వేమాలశెట్టి బావిలో బెల్లం సమర్పించి పూలు వేసి పూజించడం ఆనవాయితీ. ఇందువల్ల భక్తుల కోర్కెలు నెరవేరుతాయని ప్రతీతి. సంతానం, ఆరోగ్యం కోసం, దీర్ఘకాలిక వ్యాధుల బాధల నివారణ కోసం శ్రీ వైద్య వీరరాఘవస్వామికి విశేష పూజలు చేస్తుంటారు.

## కాలధర్మం

# బొమ్మ్మ దినకర్



గూడూరు వాస్తవ్యుడు బొమ్ము దినకర్ ఫిబ్రవరి 8వ తేదీ, సోమవారం సాయంత్రం హైదరాబాదులోని ఆయన పెద్దకుమారుడు ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 77 సంవత్సరాలు. గూడూరులో సుదీర్ఘ కాలం ఆయన కొయ్య(టింబర్) వ్యాపారం చేసేవాడు. ఆయన భార్య జయలక్ష్మి ఆయనకు పెళ్లయిన 7 సంవత్సరాలకే (1971) ఆయనను విడిచి వెళ్ళింది. ఆయనకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ప్రవీణ్, రెండవ కుమారుడు ప్రతాప్ హైదరాబాదులో సెటిలయ్యారు. చిన్న కుమారుడు ప్రశాంత్(శాంతి) గూడూరులో ఉంటాడు. దినకర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, దినకర్ ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

# తెలంగాణ ముంగిట్లో రాజన్న బిడ్డ..!

(మొదటి పేజీ తరువాయి)

జైలు పాలు చేసినప్పుడే ఆమె రాజకీయ ప్రవేశం చేసింది. ఇప్పుడు తెలంగాణలో పార్టీ పెట్టి ఆ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయబోతోంది తప్ప రాజకీయాలకు ఆమేం కొత్త కాదు.

## 'అన్న'ంటి ఉంటూనే...

తన అన్న జగన్‌తో విభేదించి షర్మిల కొత్త పార్టీ పెట్టబోతోందని మొట్టమొదటిగా ప్రచురించిన పత్రిక ఆంధ్రజ్యోతి. అయితే సహజంగానే ఆ పత్రికలో ఏ వార్త వచ్చినా గాలి వార్తగా కొట్టిపారేసే వైసిపి శ్రేణులు ఈ వార్తను కూడా తేలిగ్గానే కొట్టిపారేశారు. వైఎస్‌ఆర్‌సిపి సామాజిక మీడియా సైన్యం అయితే బూతులు కూడా తిట్టారు. ఇప్పుడు... అన్నాచెల్లెళ్ళ మధ్య విభేదాలు ఉన్నాయా... లేవా? అనే విషయం పక్కన పెడితే షర్మిల పార్టీ పెట్టడం మాత్రం ఖాయం అని స్పష్టమైపోయింది.

శ్రీరాముడు వనవాసం చేసే తరుణంలో ఆయన పాదుకలను సింహాసనంపై పెట్టి ఆయనే పరిపాలన సాగిస్తున్న భావన కలిగేలా రామరాజ్యాన్ని పాలించాడు భరతుడు. అన్న జైల్లో వుంటే ఆయన చరిష్మా ఎక్కడా తగ్గకుండా అన్నను మించిన చెల్లెలుగా, జగన్ ఆశయాన్ని కొనసాగించి పాదయాత్రలు, ఓదార్పు యాత్రలు చేపట్టింది షర్మిల. బై బై బాబూ... అంటూ సామాజిక మాధ్యమాలలో స్టార్ ఆఫ్ ది పార్టీగా నిలచిందామె.

అన్నకు అంతటి స్థాయిలో అండగా నిలచిన షర్మిల, 'అన్న'ంటి ఉంటూనే ఉండిన షర్మిల, ఇప్పుడు అన్న అభీష్టానికి వ్యతిరేకంగా తెలంగాణలో పార్టీ ఎందుకు పెడుతోంది? ఇక్కడ అన్న అభీష్టానికి వ్యతిరేకంగా అనే మాట అనక తప్పడంలేదు. ఎందుకంటే... వైఎస్ఆర్ పార్టీలో కీలకపాత్ర పోషిస్తూ ప్రస్తుతం ఆంధ్రా ప్రభుత్వ సలహాదారుగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డే స్వయంగా ఈ విషయాన్ని మీడియాకి చెప్పారు. వారిద్దరిమధ్యా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి తప్ప, బేధాభిప్రాయాలు లేవు అని స్పష్టం చేశాడు. షర్మిల పార్టీని మేం వద్దన్నాం, ఆమె మా అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఇది పూర్తిగా ఆమె వ్యక్తిగతం అని తేల్చేశాడు. తెలంగాణలోని ఆమె పార్టీతో ఆంధ్రాలోని వైసిపికి సంబంధం లేదని స్పష్టం చేశాడు.

అక్కడ షర్మిల పార్టీ నిర్ణయాన్ని ప్రకటిస్తున్న తరుణంలోనే ఢిల్లీలో విలేకరులు అడిగిన ప్రశ్నకు రాజ్యసభ సభ్యుడు, పార్టీలో మరో కీలక వ్యక్తి విజయసాయిరెడ్డి స్పందిస్తూ ఇది ఆంధ్రజ్యోతి కట్టుకథ అని చెప్పడం అందరిని ఆశ్చర్యపరచింది. అంటే... అటు కుటుంబం, ఇటు పార్టీలోని కీలక వ్యక్తులకు కూడా షర్మిల పార్టీ సమాచారం లేదన్నది స్పష్టమైపోతుంది.

## ఎన్నో అనుమానాలు, అపోహలు...

ఇప్పుడు అనేక భేతాళ ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులను వేధిస్తున్నాయి. ఉన్నట్టుండి షర్మిల పార్టీ ఎందుకు పెడుతోంది...? జగన్మోహన్‌రెడ్డితో గొడవలేమైనా ఉంటే ఆంధ్రాలో పార్టీ పెట్టాలికాని తెలంగాణను ఎందుకు ఎంపిక చేసుకుంది..? ఒకవేళ ఇది అన్నాచెల్లెళ్ళ డ్రామా అయితే, దీని వెనుక కేసిఆర్ హస్తం ఉంటే, అందువల్ల ఎవరికి లాభం...? అలాకాకుండా అన్నాచెల్లెళ్ళ మధ్య వేరే ఏమైనా మనస్పర్థలు ఉంటే, వాటిని అవకాశంగా తీసుకుని భారతీయ జనతా పార్టీ ఈ నాటకాన్ని ఆడిస్తోందా...? ఒకవేళ అదే నిజమైతే ఆంధ్రాబిడ్డ.. అదీ రాజశేఖరరెడ్డి గారాల బిడ్డ తెలంగాణలో ఎంతవరకు తన ప్రభావాన్ని చూపించగలుగుతుంది...? ఇవీ ఇప్పుడు మేధావులను సైతం తొలుస్తున్న ప్రశ్నలు.

మొన్న జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ కొంత లాభపడిన విషయం అందరికీ తెలిసిందే. ఇదే తరుణంలో కేటిఆర్ త్వరలో ముఖ్యమంత్రి అవుతాడని లీకులు రావడం, మరో పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని కేసిఆర్ ప్రకటించడం తెలంగాణలో తాజాగా జరిగిన రాజకీయ పరిణామాలు. ఇప్పుడు షర్మిల పార్టీ ప్రకటన తెలంగాణ రాజకీయాలను మరో మలుపు తిప్పబోతున్నాయన్నది కూడా కొంతమంది రాజకీయ విశ్లేషకుల అంచనా. తెలంగాణలో తన తండ్రికి ఉన్న ఇమేజ్‌ని, బలమైన వర్గాన్ని తనవైపు తిప్పుకోవాలన్నది షర్మిల ప్రయత్నమని కూడా వీరి అభిప్రాయం. ముస్లిం సోదరులు ఎట్టి పరిస్థితుల్లో బిజెపి వైపు మొగ్గరు. కేసిఆర్ పాలనపై వ్యతిరేకత ఉన్నా గత్యంతరం లేదన్నట్లు ఆయనతోనే ఉంటారు. తెలంగాణ రాజకీయాలలో రెడ్డి సామాజిక వర్గానికి చాలా కీలక పాత్ర ఉంటుంది. రాజశేఖరరెడ్డి హయాం నుండి కాంగ్రెస్‌పార్టీని అంటి పెట్టుకుని ఉన్న చాలామంది ఇప్పుడు సందిగ్ధంలో ఉన్నారు. తెలంగాణలో తెలుగుదేశం అసలు లేదు. కాంగ్రెస్ కొన ఊపిరితో ఉంది. ఇలాంటి తరుణంలో షర్మిల పార్టీ అసంతృప్తివాదులకు మంచి వేదిక కానున్నది అన్నది కూడా విశ్లేషకుల అంచనా. షర్మిల భర్త బ్రదర్ అనిల్‌కు ఉన్న క్రిస్టియన్ ఫాలోయింగ్‌తో క్రైస్తవుల ఓట్లను అధిక శాతం ఆకర్షించే అవకాశం కూడా షర్మిల పార్టీకి ఉంటుంది. అయితే తెలంగాణ సెంటిమెంటుతో రాష్ట్రాన్ని సాధించుకున్న అక్కడి ప్రజలలో రాజన్న సెంటిమెంటు ఎంతవరకు పనిచేస్తుందో వేచి చూడాలి.

రాజకీయాలలో అసాధ్యం అనుకున్నవి ఒక్కోసారి సుసాధ్యమైపోతుంటాయి. నిజంగా ఇది అన్నాచెల్లెళ్ళ మధ్య గొడవా... లేక రాజకీయ ఎత్తుగడా...? అన్నది భవిష్యత్తులో తేలిపోతుంది. ఒకవేళ అన్నాచెల్లెళ్ల గొడవే అయితే దీనికి ఆరంభంలోనే ముగింపు పలకాల్సిన ఆవశ్యకత జగన్మోహన్‌రెడ్డికి ఎంతైనా ఉంది. ఇది ఆయన విశ్వసనీయతకు సంబంధించిన అంశం. ఇంటి ఆడపడుచుకు సంబంధించిన విషయం. ప్రారంభంలోనే దీనికి ఫుల్‌స్టాప్ పెట్టి చెల్లెలి మనసు మార్చగలిగితే ఇది టీ కప్పులో తుఫానులా సమసిపోతుంది. అలా కాదని నిర్లక్ష్యం చేస్తే... ఇది కాంగ్రెస్‌పార్టీతో పెట్టుకున్న వైరంలా కాదు, చంద్రబాబుని పడకొట్టడం కాదు, ఢిల్లీ పెద్దలతో ఢీ కొట్టినట్లుగానే కాదు... ఇది ఇంటి ఆడపడుచుతో యుద్ధం.. వైయస్ ముద్దుల కుమార్తెతో పోరాటం... ఇది ఎవరికీ మంచిది కాదు. అలాకాకుండా ఇది సజ్జల చెప్పినట్లుగా భిన్నాభిప్రాయాల పరిణామం, రాజకీయ వ్యూహంలో భాగం అయితే మాత్రం ఫలితం కాలమే నిర్ణయిస్తుంది.

• తగ్గుతున్న కోవిడ్ • 9న '0' కేసులు

# కరోనా కట్టడిలో.. నెల్లూరు ముందడుగు

## ➤ వైద్యుల సేవలు.. అధికారుల అప్రమత్తతే కారణం

***కరోనా కేసుల్లో రాష్ట్రంలోనే తొలికేసు వచ్చిన నెల్లూరుజిల్లా..ఇప్పుడు కరోనా నివారణలో కూడా ముందుంటూ రికార్డు సృష్టిస్తోంది. కరోనాను పూర్తిస్థాయిలో జయించేందుకు సిద్ధమవుతోంది. వైద్యుల సేవలు, అధికారుల అప్రమత్తత, ప్రభుత్వాల పర్యవేక్షణ అన్నీ కలసి వెరసి కరోనా కట్టడికి అన్నివైపుల నుంచి చక్రబంధం పడుతోంది. దీంతో జిల్లాలో వేలాదిగా ఉంటున్న కరోనా కేసులు గత కొద్దిరోజులుగా బాగా తగ్గుతూ వస్తున్నాయి. ఈనెల 9వ తేదీన ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాకపోవడం ఎంతో విశేషం. అందరి అప్రమత్తతతో, పట్టుదలతో మన జిల్లా త్వరలోనే కరోనాను జయిస్తుందని..పూర్తిస్థాయిలో 'కోవిడ్ జీరో జిల్లా'గా మారిపోతుందని అందరూ మరింత ఉత్సాహంతో కోవిడ్ నివారణకు చర్యలు తీసుకుంటున్నారు.***

కరోనా!.. కరోనా!.. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ విన్నా ఇదే మాట. ఈ మహమ్మారి దెబ్బకు గతకొద్ది కాలంగా ప్రపంచమే వణికిపోతోంది. జిల్లాలోనూ కరోనా కల్లోలం సృష్టించింది. రాష్ట్రంలోనే తొలి కరోనా కేసు నెల్లూరు జిల్లాలోనే నమోదు కావడం అప్పట్లో పెద్ద సంచలన కలిగించింది. అయితే వైద్యుల కృషి, జిల్లా ఉన్నతాధికారుల చొరవతో కరోనా నివారణకు పెద్దఎత్తున చర్యలు ప్రారంభమయ్యాయి. పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల వారు, జిల్లా అధికార యంత్రాంగమంతా రేయింబవళ్ళు శ్రమించి ఈ వ్యాధి నివారణకు నిరంతర కృషి చేయడం ప్రారంభించారు. కరోనా అంటేనే అందరూ భయంతో వణికిపోతున్న తరుణంలో బాధితుల సేవకు ఎందరో వైద్యులు, వైద్యసిబ్బంది ముందుకు వచ్చి చికిత్సలు చేయడం ప్రారంభించారు. ఒకవైపు ప్రధాని మోడీ, మరోవైపు రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ ఎప్పటికప్పుడు కరోనా పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేస్తూ, అధికారులు తీసుకోవాల్సిన చర్యల పట్ల అనుక్షణం పర్యవేక్షించడం ప్రారంభించారు.

### ప్రాణాలకు తెగించి పోరాడారు

కరోనా వైరస్ అంటనే వణికిపోతున్న పరిస్థితుల్లో కరోనా బాధితులకు వైద్యం చేసేందుకు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ముందుకు వచ్చిన వైద్యుల మానవీయ సేవలనూ ఎవరూ మరచిపోలేరు. వారందరి కృషి ఫలితంగా కరోనా కోరలకు చిక్కిన బాధితులు మృత్యువు నోటినుంచి బయటపడి క్రమేణా కోలుకోవడం ప్రారంభించారు. జిల్లాలో తొలి కరోనా బాధితుడు కరోనా నుంచి కోలుకుని ఉత్సాహంగా ఇంటికి వెళ్ళడం కూడా నెల్లూరు జిల్లాలోనే కావడం అందరికీ ఆనందం కలిగించింది. ఇది మరో సంచలనమైంది కూడా. కరోనా వ్యాధిని కట్టడి చేసేందుకు ప్లాస్మా థెరపీ వినియోగంలోకి వచ్చిన సందర్భంలో తొలి ప్లాస్మా థెరపీ చికిత్స కూడా నెల్లూరుజిల్లాలోనే ప్రారంభమైంది. మరోవైపు కరోనా బాధితులను గుర్తించేందుకు, అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి కోవిడ్ వైరస్ సోకిన వారిని వెంటనే వైద్యచికిత్సలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం ఎంతో చొరవ చూపింది. దీంతో వేలాదిమంది కరోనా బారినపడిన వారిని గుర్తించి చికిత్సలు అందించడంతో కరోనా నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు కోలుకునే పరిస్థితి ఏర్పడింది.

### వైద్యుల సేవ అమోఘం

గత ఏడాది మార్చి నుంచి నెల్లూరుజిల్లాలో కరోనా తన ప్రతాపం చూపుతూ వచ్చింది. ఒక్కటొక్కటిగా కేసులు పెరుగుతూవచ్చాయి. ఆ సంఖ్య కొద్దిరోజుల్లోనే పదుల సంఖ్యగా, ఆ తర్వాత వేలల్లోకి మారింది. కరోనా విజృంభిస్తున్న రోజుల్లో ఒకరోజు జిల్లాలో 1500 కేసుల దాకా కూడా నమోదయ్యాయంటే కరోనా ఉధృతి ఎంత తీవ్రంగా ఉండిందో అర్థమవుతుంది. కరోనా బారి నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిన చొరవ, అనేకమంది వైద్యులు చూపిన తెగువ ఎనాటికీ ఎవరూ విస్మరించలేరు. కరోనాను కట్టడి చేసేందుకు కృషిచేస్తూ విధి నిర్వహణలో ఉన్న పలువురు పోలీసులు, వైద్యులు, వైద్యసిబ్బంది కూడా కరోనా వాతపడ్డారు. వారిలో పలువురు మరణించారు కూడా. అయినా ఎవరూ వెనుకంజ వేయలేదు. ఎంతో ధైర్యంగా ఆ వ్యాధిని కట్టడి చేసేందుకు తమవంతు సేవలందించారు.

### అధికారుల కృషి అమోఘం

జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు నిరంతర పర్యవేక్షణతో పాటు జాయింట్ కలెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, హరేందిర ప్రసాద్, జిల్లా ఎస్‌పి భాస్కర్‌భూషణ్‌లతో పాటు పోలీసు యంత్రాంగం ఒక్కక్షణం కూడా వృధా చేయకుండా కరోనా నివారణకు భారీ చర్యలు చేపట్టారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి నేరుగా కరోనా రోగులతో మాట్లాడేందుకు కూడా వెనుకంజవేయలేదు. అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ, రోగులను పరామర్శిస్తూ వారిలో ఆత్మస్థైర్యం కలిగించారు. ఈ కరోనా కష్టకాలంలో బాధితులను ఆదుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ఎందరో ప్రజా ప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంధసేవకుల సేవలు కూడా అద్భుతం..అపూర్వమేననిపించాయి. కరోనాతో అనేక మంది మృత్యువాతపడడం కూడా ఎంతో బాధాకరం. అయితే, కరోనాతో మరణించిన వారిని చూసేందుకు, వారికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ రాని పరిస్థితుల్లో, చివరికి కుటుంబసభ్యులు కూడా భయంతో రాని తరుణంలో ఎంతో ధైర్యంగా సేవాభావంతో ముందుకు వచ్చి ఆ మృతదేహాలకు అంత్యక్రియలు జరిపించిన మహానుభావులెందరో ఉన్నారు. అలాంటి వారి రుణం తీర్చుకోలేం కూడా.

### క్రమేణా తగ్గుతున్న కేసులు

ఇటీవలే కరోనా కేసుల సంఖ్య క్రమేణా వేల నుంచి వందలకు, వందల నుంచి పదులకు తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ జిల్లా అధికార యంత్రాంగం నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉంది. దీంతో గత కొద్దిరోజులుగా కరోనా కేసులు మరింతగా తగ్గుముఖం పట్టాయి. ఈ వారంలో సుమారుగా 10లోపు కేసులే వచ్చాయి. అయితే తాజాగా ఈనెల 9వ తేది మంగళవారం రోజున జిల్లాలో ఒక్క కోవిడ్ కేసు కూడా రాకపోవడం విశేషం. దీంతో నెల్లూరు జిల్లా 'కోవిడ్-జీరో జిల్లా' కావడం అందరికీ ఆనందం కలిగించింది. మళ్ళీ బుధవారం రోజున 5 కేసులు నమోదుకావడంతో జిల్లాలో బుధవారం నాటికి మొత్తం కరోనా కేసుల సంఖ్య 63,940 కాగా, కోవిడ్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 63,873కు చేరింది. 67 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఏదేమైనా, కరోనా కట్టడిలో జిల్లా మెరుగ్గా ఉండడం, కరోనా కేసుల సంఖ్య బాగా తగ్గిపోతుండడం సంతోషించదగ్గ విషయం.

### అప్రమత్తంగానే ఉండాలి

కరోనా మాయదారి వ్యాధిని నమ్మడానికి వీల్లేదు. ఈ వ్యాధి పూర్తిగా సమసిపోయేవరకు ప్రజలంతా అప్రమత్తంగానే ఉంటూ ప్రభుత్వాలు, అధికారులు చెప్తున్న నియమ నిబంధనలు పాటిస్తూనే ఉండాలి. మాస్కులు ధరిస్తూ, సామాజిక దూరం పాటిస్తూ, ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటూ కరోనా నివారణకు కృషిచేయాలి. ఏదో ఒకరోజున పూర్తిస్థాయిలో మనం కరోనాను జయిస్తాం!.. ఆ రోజు ఇక ఎంతో దూరంలో లేదు. కరోనాను జయించడంలో మన జిల్లాయే అగ్రస్థానంలో ఉండాలని కోరుకుంటూ.. అందరం కరోనా కట్టడికి పూర్తిస్థాయిలో కృషిచేద్దాం!...

వీక్షణం
- మంజీర

## సెలబ్రిటీలు..

# కామెంట్‌లు-కాంట్రవర్సీలు

రైతుల ఉద్యమం మొదలై దాదాపుగా ఆరు నెలలైంది. ఢిల్లీ సరిహద్దులో శరీరం గడ్డకట్టే చలిలో ఉద్యమ సెగలు రగిలించుకుంటూ పోరాడుతున్నారు రైతులు. ప్రభుత్వం రూపొందించిన చట్టాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి దేశవ్యాప్తంగా స్పందన గళాలు మద్దతు పలుకుతున్నాయి. ఉద్యమ వార్తలు విదేశాలకూ చేరాయి. అంతర్జాతీయ పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్, పాప్ సింగ్ రిహాన్నా, పోర్నోగ్రఫిక్ నటి మియా ఖలీఫా కూడా ఉద్యమానికి మద్దతు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. 'అక్కడెక్కడో స్వీడన్‌లో ఉన్న గ్రెటా మనదేశంలో ఉద్యమానికి మద్దతు పలకడం ఏమిటి? ఉద్యమానికైనా, ప్రభుత్వానికైనా మద్దతు పలకడానికి ఇక్కడ మేమంతా లేమా' అనుకున్నట్లున్నాడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్. 'ఇది మా దేశ అంతర్గత సమస్య. మేము చూసుకుంటాం' అని బదులు ట్వీట్ పెట్టాడు. నిజానికి సచిన్ అన్న మాటలో తప్పేమీ కనిపించడం లేదు. కానీ నెటిజన్‌లు సచిన్ మీద విరుచుకుపడ్డారు. సచిన్‌ను ఆడిపోసుకోడానికి అప్పుడెప్పుడో సచిన్ ఎవరో తెలియదన్నందుకు రష్యాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి మారియా షరపోవా మీద రాళ్ల వర్షం కురిపించిన నెటిజన్‌లే ఇప్పుడు సచిన్‌ను తిట్టడానికి మారియా మీద పూల వర్షం కురిపిస్తున్నారు. ఆనాడు మారియాను తిట్టడంలో లోపించిన విచక్షణ ఈ రోజు సచిన్ మీద రాళ్లు కురిపించడంలోనూ వ్యక్తమవుతోంది. ఇంతలో శరద్ పవార్ కూడా సచిన్ మీద తన వంతుగా ఒక రాయి పడేసి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశాడు. ఇది ఇలా ఉంటే...

### ట్వీట్ బాణాలు

ఒక కంగనా రనౌత్, మరో తాప్సీ పన్ను ఒకరినొకరు ట్వీట్‌లతో దూషించుకున్నారు. 'దేశ ప్రగతిలో రైతులు కీలక పాత్ర వహిస్తున్నారు. వారి కోసం మనందరం కలిసి పని చేయాలి' అన్న రోహిత్ శర్మ ఆశాభావం మీద కూడా కంగన నిప్పులు చెరిగింది. ఆ చెరగడంలో కొన్ని నిప్పులు రైతుల మీద కూడా పడ్డాయి. 'ఉద్యమం చేస్తున్నది రైతులు కాదు ఉగ్రవాదులు, రైతు ఉద్యమం దేశానికి పట్టిన క్యాన్సర్' అనే ట్వీట్‌లను ట్విట్టర్ తొలగించింది. మేము ఊరుకుంటే స్వామిభక్తి నిరూపించుకునేదెలా అనుకున్నారేమో డ్రీమ్‌గర్ల్ హేమమాలిని, ఖుష్బూలు కూడా నిష్టుర వ్యాఖ్యలతో గ్రెటాను తప్పుపట్టారు. పిల్లకాకి అంటూ తేల్చేశారు. లతా మంగేష్కర్, అక్షయ్‌కుమార్, అజయ్ దేవగన్‌లు కూడా ఏదో ఒకటి అనకపోతే బావుండదని ఒక్కో ట్వీట్ చేసి ఊరుకున్నారు. ఇది ఇలా ఉంటే... ప్రభుత్వానికి మద్దతు పలికిన సెలబ్రిటీల ట్వీట్‌లన్నీ ఒకే మూసలో సాగాయని, అవి బీజేపీ ఐటీ సెల్ నుంచి విడుదలైన మాస్టర్ కాపీకి నకళ్లనీ రంధ్రాన్వేషణ కూడా మొదలైంది. మిగిలిన అందరి ట్వీట్‌లు తమలపాకుతో కొట్టినట్లు సుతారంగా ఉన్నాయి, కానీ కంగనా ట్వీట్‌లు మాత్రం తలుపుచెక్కతో కొట్టినట్లున్నాయి. 'న ఘర్ కా... న ఘాట్ కా...' అంటూ ఒక సెలబ్రిటీపై లేనిపోని విమర్శలు గుప్పించింది. మరొక సెలబ్రిటీని బీ గ్రేడ్ మనుషులు, బీ గ్రేడ్ ఆలోచనలు అంటూనే 'మాతృభూమి పట్ల విశ్వాసం, కర్మఫలం, ధర్మఫలం...' అంటూ పెద్ద మాటల ఔన్నత్యం మాటున తిప్పికొట్టింది. 'రైతులు మనదేశంలో అంతర్భాగం' అన్న విరాట్ కోహ్లీ సుద్దులకు ప్రతిగా కూడా నెటిజన్‌లు విరుచుకుపడ్డారు. మొత్తంగా చూస్తే...

### సామాజిక స్పృహ అంటే ఇదేనా!

ఈ మాటల యుద్ధంలో సెలబ్రిటీలు కానీ సాధారణ నెటిజన్‌లు కానీ ఎవరూ రైతుల సమస్యలను బుర్రలోకి ఎక్కించుకున్నట్లు కనిపించడమే లేదు. సినీ సెలబ్రిటీలకేమో 'తాము గ్లామర్‌కే పరిమితం కాదు, సామాజిక స్పృహ మెండే' అనిపించుకోవాలనే తపన. ఏదో ఒకలా స్పందించడం ద్వారా కరెన్సీలో ఉండాలనే ఆశ క్రీడాకారులది. లిబరలిస్టులకు మాత్రం అధికారంలో ఉన్నది మతం రంగు పులుముకున్న బీజేపీ కాబట్టి ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పే అవకాశాల కోసం డేగ కళ్లతో చూడడంతోనే సరిపోతోంది. ఉదారవాదులు బీజేపీని, ప్రభుత్వాన్ని ఎంతగా విమర్శించినా 'ఇందులో విచిత్రం ఏముంది' అనుకోవడం తప్ప వాళ్ల వ్యాఖ్యలకు పెద్దగా ప్రాధాన్యం లభించకపోవడంతో... ప్రభుత్వాన్ని, బీజేపీని తప్పు పట్టిన వాళ్లను మోయడం అనే కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

### కళ్లద్దాలు తీసి చూస్తే!!

రైతు ఉద్యమాన్ని బీజేపీ కళ్లద్దాలు పెట్టుకుని చూసే వాళ్లు, బీజేపీ వ్యతిరేక కళ్లద్దాలతో చూసేవాళ్లుగా మాత్రమే కనిపిస్తున్నారు తప్ప... రైతు సమస్యల మీద స్పందించే వాళ్లు కరవయ్యారనే చెప్పాలి. నిజంగా రైతులు సమస్యల్లో కూరుకుపోయినప్పుడు ఈ ఉదారవాదులు, సెలబ్రిటీల్లో తల తిప్పి చూసిన వాళ్లెందరు? రైతు కష్టాలంటే వర్షం లేక... నేల ఎండిపోయి కరవు కోరల్లో చిక్కడం, వర్షం ఎక్కువై పండించిన పంట వరదలపాలు కావడం ప్రధానమైనవి. రైతులు నిజంగా కష్టంలో ఉన్నప్పుడు మన కంచంలో ఉన్న మెతుకులు గుర్తుకు వచ్చేది ఎందరికి? రైతుల కోసం తన చెమట చుక్కలను ధారపోస్తున్న రాజశ్రీ దేశ్‌పాండే ఎప్పుడూ ఇలా ట్వీట్‌లతో ప్రచారం పొందాలని చూడడం లేదు. రాజశ్రీ దేశ్‌పాండేకి స్టార్ హోదా లేదు, సెలబ్రిటీ గుర్తింపు కూడా లేదు. ఆమె బాలీవుడ్‌లో చిన్న పాత్రల్లో కనిపించే చిన్న నటి. మహారాష్ట్రకు చెందిన రాజశ్రీ దేశ్‌పాండే... మరాఠ్వాడాలోని కరవు పీడిత ప్రాంతంలోని పంధారీ అనే గ్రామం కోసం అంకిత భావంతో పని చేసింది. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు, చెరువుల పూడిక తీత, కాలువల నిర్మాణం చేయించింది. గ్రామంలో టాయిలెట్‌ల నిర్మాణంలో ప్రభుత్వం ఇచ్చే డబ్బుకు మ్యాచింగ్‌గా లబ్ధిదారుల కంట్రిబ్యూషన్‌కు తాను విరాళం ఇచ్చింది. రేపటి తరం కోసం పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్ - పొల్యూషన్‌లకు వ్యతిరేకంగా బాలీవుడ్ సీనియర్ నటి జుహీచావ్లాతో కలిసి పనిచేస్తోంది. వీళ్లు చేస్తున్న పనులేవీ ట్వీట్‌ల రూపంలో ప్రచారంలో ఉండవు. ఎందుకంటే వీళ్లిద్దరూ తమ పబ్లిసిటీ కోసం వర్తమానంలో ఉన్న సామాజిక సమస్యను నెత్తికెత్తుకుని సామాజిక మాధ్యమాల్లో వేళ్లు కాల్చుకోవడం లేదు. ఎండిన పొలానికి ఒక్క నీటి చుక్కను అందించలేని సెలబ్రిటీలు, పంటను నీళ్ల పాలు చేసుకున్న రైతుకు ఒక్క పూట అన్నం పెడదామనే ఆలోచన లేని వాళ్లందరూ రైతుల ఉద్యమాన్ని అడ్డు పెట్టుకుని ట్రెండింగ్‌లో ఉండాలని చూడడం సిగ్గుచేటు.

# పతనం అంచుల్లో పచ్చ పార్టీ!

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలతో వాటిని అడ్డుకుని, ప్రతిపక్ష పాత్రను చాక చక్యంగా పోషించాలి. 2019 ఎన్నికలలో 175సీట్లకు గాను కేవలం 23 సీట్లకే పరిమితమైన తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పై విధా నాలన్నిటికీ స్వస్తిపలికాడు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుండి మాటకొస్తే 'నువ్వు రాజీనామా చెయ్యి' అంటూ జగన్మోహన్‌రెడ్డిపై విరుచుకుపడుతున్నాడు.

ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలలోనూ, మీడి యాతో మాట్లాడేటప్పుడూ, ఆయన సంయమనం కోల్పోతున్నాడు. సాక్షాత్తు ముఖ్యమంత్రిని వాడూ, వీడూ అని సంబోధించి తనకు తానే పలుచనైపోతు న్నాడు. తన అనుభవమంత వయసున్న జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం జీర్ణించుకోలేకపోతున్నాడు. అధికారపక్షాన్ని ఇరకాటంలో పెట్టాల్సిందిపోయి, అనవసరపు ఆవేశంతో, తనకుతానే సమస్యలచక్రంలో ఇరుక్కుపోతున్నాడు. ఇక్కడ జగన్మోహన్‌రెడ్డి బలం, బలహీనతలు పక్కనపెడితే.. బాబు అసహనమే జగన్‌కు కలిసొచ్చే అంశంగా మారిపోయింది. జగన్మో హన్‌రెడ్డి అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని, నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ని పంచాయతీ ఎన్నికల వ్యవహారంలో తనకు అనుకూలంగా మార్చుకోవాలని బాబు చేసిన ప్రయత్నం కూడా బెడిసికొట్టింది. అక్కడ తప్పు జరిగింది, ఇక్కడ ఘోరం జరిగిపోయింది అని గగ్గోలు పెడుతున్న బాబు కడుపుమంట మీద నీళ్లు చల్లినట్లుగా ఎక్కడా తప్పు జరగలేదు, ఎలాంటి ఘోరాలకూ తావులేదు అంటూ రమేష్‌కుమార్ ఇచ్చిన ప్రకటన, బాబు ప్రతిష్టను మరింత దిగజార్చింది.

## అయోమయంలో ద్వితీయ శ్రేణి..

ఇక పార్టీలో ద్వితీయశ్రేణి నాయకులు కూడా అయోమయంలో ఉన్నారు. గత ఎన్నికలలో బాబుని నమ్ముకుని, ఉన్నవన్నీ అమ్ముకుని, ఇల్లూ, వళ్ళు గుల్ల చేసుకున్న వాళ్ళు చాలామంది వున్నారు. అమరావతిని నమ్ముకుని పెట్టుబడి పెట్టినవారు, బాబు పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని ఆశించి ఆర్థికంగా అండగా నిలచిన వారూ, పార్టీ ఇస్తుంది ఎంతైనాసరే పోరా డండి అని అయ్యావారు చెప్పిన మాటలు నమ్మి మోస పోయిన అభ్యర్థులూ, ఇప్పుడు తమ కొంప కొల్లే రయ్యిందని లబోదిబోమంటున్నారు. పెదబాబూ, చినబాబూ మాత్రం తెలంగాణలో ఒక్క సారిగా వచ్చిన రియల్ బూమ్‌తో అమాంతం పెరిగిన తమ ఆస్తుల విలువ కట్టుకుంటూ, తాము కొత్తగా ఆధునీకరించు కున్న ఏడంతస్తుల మేడను చూసుకుని మురిసిపో తున్నారు. ఇప్పటికే తెలంగాణలో కనుమరుగైపోయిన తెలుగుదేశం పార్టీని క్రమేణా ఆంధ్రాలో కూడా పతనం అంచులకు తీసుకువెళుతున్నారు.

## అన్నీ జగన్‌కి కలిసొచ్చే అంశాలే...

జగన్మోహన్‌రెడ్డికి పరిపాలన కొత్త కావొచ్చు, కొన్ని విషయాలు తెలియకపోవచ్చు, కానీ ప్రజల కష్టాలు ఆయనకు బాగా తెలుసు. ప్రజల మనసులు ఎలా ఆకట్టుకోవాలో కూడా తెలుసు. తాను చేసిన సుదీర్ఘ ప్రజాసంకల్ప యాత్రలో ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ఆయన ధ్యేయం. నవరత్నాలను ప్రజలకు చేర్చడమే ఆయన లక్ష్యం. ఆయనకు పార్టీ నాయకులతో పనిలేదు, కార్యకర్తలతో అవసరంలేదు. ఇప్పుడు గెలిచిన అభ్యర్థులనే మళ్ళీ రానున్న ఎన్నికలలో నిలపాలన్న నియమం లేదు. ఆయన దృష్టాంతా ప్రజా సంక్షేమంపైనే. తమ ప్రభుత్వం అమలుచేసే పథకాలన్నీ ప్రతి గడపకూ చేర్చడమే. అవన్నీ సక్రమంగా జరిగితే ప్రజలే మళ్ళీ అధికారం కట్టబెడతారు. తాను ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా తననుచూసి గెలిపిస్తారు. ఇదే ఆయన ఫార్ములా... ధీమా కూడా. ఇలాంటి తరుణంలో మామూలుగా అయితే, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా పుంజుకుంటాయి. రాజకీయంగా బలపడే ప్రయత్నం చేస్తాయి. కానీ ఇక్కడ అలా జరగడంలేదు. తాను చేసే వరసతప్పులతో బాబు బలహీనపడిపోతున్నాడు.

ఒకవైపు అపార ప్రజాదరణ, మరోవైపు అస మర్థ ప్రతిపక్షం... ఇవి రెండూ జగన్మోహన్‌రెడ్డికి కలి సొచ్చే అంశాలుగా మారి అత్యంత శక్తివంత మైన ముఖ్యమంత్రిగా అవతరించి బాహుబలిలా బలపడుతున్నాడు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com